

నేత్రపర్వం... అప్పన్న తిరు కల్యాణం

- హరినామస్మరణతో మార్మోగిన సింహగిరి

వరాహలక్ష్మీనృసింహుని వార్షిక తిరు కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి పది గంటలకు నేత్రపర్వంగా సాగింది. అశేష భక్తుల హరినామస్మరణ మధ్య పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో పండితులు కల్యాణ క్రతువును జరిపించారు. అంతకుముందు సాయంత్రం ఎదురు సన్నాహోత్సవం రంజింపజేసింది. ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతి రాజు దంపతులు రథోత్సవాన్ని ప్రారంభించారు. - వివరాలు I పేజీలో



పాయకరావుపేటలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి

అనకాపల్లి జిల్లాలోకి జగన్ బస్సు యాత్ర

- కాకినాడ జిల్లా నుంచి పాయకరావుపేట వద్ద ప్రవేశం
- అభివాదం చేస్తూ ముందుకు సాగిన సీఎం
- నక్కపల్లి మండలం గొడిచెర్లలో రాత్రి బస
- నేడు కశింకోట మండలం గొబ్బూరులో బహిరంగసభ

పాయకరావుపేట/నక్కపల్లి/అనకాపల్లి, ఏప్రిల్ 19: ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర కాకినాడ జిల్లా నుంచి శుక్రవారం రాత్రి పాయకరావుపేట వద్ద అనకాపల్లి జిల్లాలోకి ప్రవేశించింది. తుని నుంచి పాయకరావుపేట వద్ద గల తాండవ జంక్షన్ వరకు బస్సు లోపల ఉన్న ఆయన అక్కడి నుంచి వాహనంపైకి ఎక్కి అభివాదం చేసుకుంటూ ముందుకుసాగారు. వై జంక్షన్ వద్ద వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎంపీ కె.సత్యవతి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు ఘన స్వాగతం పలికారు. కొద్దిసేపటి అనంతరం జగన్మోహన్‌రెడ్డి మళ్లీ బస్సు లోపలకు వెళ్లి, ముందు సీట్లో కూర్చుని ప్రజలకు అభివాదం చేసుకుంటూ నక్కపల్లి మండలంలోకి ప్రవేశించారు.

గొడిచెర్లలో రాత్రి బసకు చేరుకున్న జగన్

వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం రాత్రి 9.30 గంటలకు నక్కపల్లి ... మిగతా 8వ పేజీలో

పెరిగిన విమానయానం

- విశాఖ నుంచి 2022-2 ఆర్థిక సంవత్సరంలో 25,00,654 మంది ప్రయాణం
- 2023-24లో 27,84,428
- 10.19 శాతం పెరిగిన ప్రయాణికులు
- వారం రోజుల్లో మలేషియా విమానం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



విశాఖపట్నం విమానాశ్రయం పురోభివృద్ధి సాధిస్తోంది. గత ఏడాది కాలంలో ప్రయాణికుల సంఖ్య 10.19 శాతం పెరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 25,00,654 మంది ప్రయాణం చేయగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 27,84,428కి పెరిగింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 2,85,974 మంది ప్రయాణికులు పెరిగారు. అంటే సగటున నెలకు 23,831 మంది, రోజుకు 794 మంది అధికంగా ప్రయాణించారు. గత ఏడాది మే నెలలో అత్యధికంగా 2,90,182 మంది ప్రయాణించగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో 1,91,189 మంది ప్రయాణించారు. వాస్తవానికి నవంబరు నుంచి మార్చి 31 వరకు రన్‌వే రీ సర్ఫేసింగ్ పనుల వల్ల రాత్రి 8 నుంచి ఉదయం 7 గంటల వరకు విమానాల రాకపోకలు రద్దు చేశారు. దాంతో పలు సర్వీసులు రద్దయ్యాయి. అందువల్ల ప్రయాణికుల సంఖ్య కొంత వరకు తగ్గింది. లేదంటే ఇంకా ఎక్కువ మంది ప్రయాణించి ఉండేవారని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు నరేష్‌కుమార్, కుమార్‌రాజా, వర్మలు తెలిపారు. అలాగే వారం రోజుల్లో మలేషియాకు అంతర్జాతీయ విమానం అందుబాటులోకి రానుందని చెప్పారు.

కొత్త సౌకర్యాలు

విమానాశ్రయంలో కొత్తగా ఇన్‌లైన్ బ్యాగేజ్ స్క్రీనింగ్ అందుబాటులోకి తీసుకువస్తున్నారు. అలాగే డిజి యాత్ర సర్వీసును ప్రారంభించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనివల్ల ప్రయాణికులకు నిరీక్షించే సమయం తగ్గుతుంది. ఆధార్ వెరిఫికేషన్ పనులన్నీ వేగవంతంగా పూర్తయి వెయిటింగ్ లాంజ్‌కి త్వరగా వెళ్లిపోవచ్చు.



సింహగిరిపై భక్తులు



అప్పన్న తిరు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం దేవస్థానాన్ని కలెక్టర్ చేతిలో పెడితే ఎలా!?

గత ఏడాది ఉత్సవ నిర్వహణలో వైఫల్యానికి బాధ్యులు ఎవరు

జాయింట్ కలెక్టర్ విచారణ నివేదిక ఏమైంది

- అసలు తప్పు ఎవరిదో చెప్పరా?, ఏమిటీ వైఖరి..?
- ఏడాదైనా బాధ్యులపై చర్యలు తీసుకోరా?
- ఇలాగైతే దేవస్థానానికి చెడ్డపేరు రాదా??
- దేవస్థానం స్వయం ప్రతిపత్తిని దెబ్బ తీస్తున్నారా...
- ఏ కార్యక్రమం నిర్వహించినా కనీసం ధర్మకర్తకు సమాచారం ఇవ్వడం లేదు
- ఈవోకు అనువంశిక ధర్మకర్త, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు లేఖ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహాచలేశుని చందనోత్సవం ఏర్పాట్లు, గత ఏడాది ఉత్సవ నిర్వహణలో వైఫల్యం, దానికి బాధ్యులు ఎవరు?...అనే అంశాలపై దేవస్థానం అనువంశిక ధర్మకర్త, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు తాజాగా ఆలయ ఈఓకు ఓ లేఖ రాశారు. అందులో అనేక అంశాలను ప్రస్తావించి, ప్రశ్నించారు. దేవస్థానం స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ అని, దాని ప్రత్యేకతను అధికారులు కాపాడాలని కోరారు. ప్రతి అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళుతున్నామని చెబుతున్నారని, ఆయన 'ఓకే' అంటే అమలు చేస్తామనే విధంగా వ్యవహరిస్తున్నారని, కలెక్టర్‌కు దేవస్థానంతో సంబంధం ఏమిటని ఆయన ప్రశ్నించారు.



అప్పన్న కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి అశోక్‌గజపతిరాజు దంపతుల పూజలు

- గత ఏడాది చందనోత్సవం చాలా ఘోరంగా జరిగిందని, నిర్వహణలో అధికారులు విఫలమయ్యారని, దానిపై జాయింట్ కలెక్టర్ విచారణ జరిపి దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి నివేదిక పంపించారని, అది ఇంతవరకూ ఎందుకు తెప్పించలేదని ఈఓను ప్రశ్నించారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే దేవస్థానానికి చెడ్డపేరు రాదా?...అని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. తప్పులు ఎక్కడ జరిగాయో తెలుసుకొని, వాటిని తక్షణమే సవరించుకోకపోతే ఎలా?...అని ప్రశ్నించారు. వారు నివేదిక ఇచ్చినప్పుడే చేస్తామని ఎన్ని రోజులు కాలయాపన చేస్తారో చెప్పాలని కోరారు. గత ఏడాది తప్పులు చేసిన వారు మళ్లీ ఇప్పుడు అవే తప్పులు చేస్తే దానికి బాధ్యత ఎవరు వహిస్తారో చెప్పాలన్నారు. తక్షణమే నివేదిక తెప్పించి, బాధ్యులపై ఉత్సవంలోగానే చర్యలు తీసుకోవాలని పరోక్షంగా సూచించారు.

- ఈ ఏడాది మే 10వ తేదీన నిర్వహించాల్సిన చందనోత్సవానికి సంబంధించి సమీక్ష సమావేశం ఏర్పాటుచేసి, దాని తీర్మానాన్ని కలెక్టర్‌కు ఆమోదం కోసం పంపామని ఈఓ కార్యాలయం నుంచి తనకు లేఖ వచ్చిందని, ఏ చట్టం ప్రకారం కలెక్టర్‌కు పంపించారని అశోక్‌గజపతిరాజు ప్రశ్నించారు. ఆయన ఒప్పుకుంటేనే చర్యలు తీసుకోవాలనే నిబంధన ఎక్కడుందని ఆయన నిలదీశారు. దేవస్థానానికి స్వయం ప్రతిపత్తి ఉందని, దానిని తీసుకువెళ్లి కలెక్టర్ చేతిలో ఎలా పెడతారన్నారు. కలెక్టర్ సమయానుకూలంగా మంచి సూచనలు చేస్తే తీసుకోవడంలో తప్పు లేదని, కానీ ఆయన చెప్పేంత వరకు పనులు చేపట్టకుండా కూర్చొంటారా?, ఈలోగా పనులు చేయాల్సిన బాధ్యత మనకు లేదా?...అని ఆయన అడిగారు.

ఏ విషయమన్నా చెబుతున్నారా?

గత ఏడాది చందనోత్సవం వైఫల్యం సమీక్ష నుంచి ఇప్పటివరకు పరిస్థితిలో ఎటువంటి మార్పు రాలేదని అశోక్‌గజపతిరాజు ఆరోపించారు. దేవస్థానానికి కమిటీ వేసినా, వేరే ఏ కార్యక్రమం ... మిగతా 8వ పేజీలో

రెండో రోజు 28 నామినేషన్లు

- లోక్‌సభకు ఆరు, అసెంబ్లీ సెగ్మెంట్లకు 22 నామినేషన్లు
- అత్యధికంగా పెందుర్తికి 10 నామినేషన్లు
- నామినేషన్లు దాఖలు చేసిన వారిలో వెలగపూడి, ఆడారి ఆనందకుమార్, పంచకర్ల రమేష్‌బాబు, అదీప్‌రాజు, కేకే రాజు
- రెండు రోజుల్లో 38 నామినేషన్లు దాఖలు
- గాజువాక, 'సౌత్'లకు నామినేషన్లు నిల్

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండో రోజు నామినేషన్ల జోరు పెరిగింది. శుక్రవారం విశాఖ పార్లమెంటు స్థానానికి ఆరు, అసెంబ్లీ స్థానాలకు 22 మొత్తం 28 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో గడచిన రెండు రోజుల్లో జిల్లాలో దాఖలైన నామినేషన్ల సంఖ్య 38కి చేరింది. శుక్రవారం విశాఖ పార్లమెంటు స్థానానికి పెదపెంకి శివప్రసాద్ (బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ), బన్న రమేష్ (దళిత బహుజన్ పార్టీ), సొండి కృష్ణ, చప్పిడి రాము, మహ్మద్ గౌస్ ముద్దీన్‌ఖాన్ (ఇండిపెండెంట్లు) ఒక్కొక్క సెట్ నామినేషన్ దాఖలు చేశారు. నవభారత నిర్మాణ సేవా పార్టీ నుంచి చింతాడ సూర్యం రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇక భీమిలి, విశాఖ తూర్పు, ఉత్తరం, పశ్చిమ, పెందుర్తి అసెంబ్లీ స్థానాలకు 22 నామినేషన్లు దాఖలయ్యాయి. తూర్పు నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకష్ణబాబు, పెందుర్తి నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, జనసేన అభ్యర్థిగా పంచకర్ల రమేష్‌బాబు తరఫున ఆయన సోదరుడు వెంకటేశ్వరరావు, పశ్చిమ నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థిగా ఆడారి ఆనందకుమార్, 'నార్త్'కు వైసీపీ అభ్యర్థిగా వైసీపీ నుంచి కేకే రాజు ... మిగతా 8వ పేజీలో



జేసీకి నామినేషన్ అందజేస్తున్న వెలగపూడి రామకృష్ణబాబు. చిత్రంలో ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, బాబ్జీ ఉన్నారు



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేస్తున్న 'పశ్చిమ' నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

గంగవరం పోర్టులో సేమ్ సీన్

- నిలిచిపోయిన కార్యకలాపాలు..
- కొనసాగుతున్న కార్మికుల ఆందోళన
- చర్చలకు ముందుకురాని యాజమాన్యం
- స్టీల్‌ప్లాంటుకు తీరని బొగ్గు కొరత

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గంగవరం పోర్టులో నిర్వాసిత కార్మికుల ఆందోళన పదో రోజుకు చేరింది. వారి డిమాండ్లను ఆమోదించేందుకు యాజమాన్యం ఆసక్తి చూపడం లేదు. చర్చలు మధ్యలోనే ఆగిపోయాయి. కార్మికులు ఆందోళన కొనసాగిస్తుండడంతో పోర్టులో కార్యకలాపాలు పూర్తిగా ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో విశాఖపట్నం స్టీల్ ప్లాంటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది.

బొగ్గు సరఫరా నిలిచిపోవడంతో పలు విభాగాలు షట్‌డౌన్ చేసేశారు. సెయిల్ నుంచి రెండు దఫాలుగా ఎనిమిది వేల టన్నుల బొగ్గు రావడంతో దానిని ఉపయోగించి శనివారం కోక్ ఓవెన్లలో టెంపరేచర్ అదే స్థితిలో కొనసాగించే ప్రయత్నం చేయనున్నట్టు ఉక్కు కార్మిక వర్గాలు తెలిపారు. మరోవైపు గంగవరం పోర్టు నుంచి విశాఖ పోర్టుకు చేరిన రెండు నౌకల నుంచి బొగ్గును దిగుమతి చేసి కొంత ర్యాకుల ద్వారా, మరికొంత లారీల ద్వారా స్టీల్‌ప్లాంటుకు పంపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

సమ్మె నోటీసు ఇవ్వలేదని పోర్టు నాటకం

స్టీల్‌ప్లాంటుకు ముడిసరకులు అందించాల్సిన బాధ్యత అదానీ గంగవరం పోర్టుది. దానిని యాజమాన్యం విస్మరించింది. పోర్టులో కార్మికులు 21 రోజుల ముందుగా నోటీసు ఇచ్చి సమ్మెకు దిగాల్సి ఉంటుందని, కానీ వారు అలా చేయలేదని, మెరుపు సమ్మెకు దిగడం వల్ల తాము ముందస్తు ఏర్పాట్లు చేయలేదని ఉక్కు యాజమాన్యానికి లేఖ రాసింది. ఏ సమ్మె అయినా దాని ఫలితంగా సరకు సరఫరా ఆగిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ఉన్నా దానిని తప్పించుకుంటున్నదని ఉక్కు అధికార, కార్మిక వర్గాలు ఆరోపిస్తున్నాయి. సమ్మెను విరమింపజేయడానికి పోర్టు యాజమాన్యం ఎటువంటి చొరవ చూపడం లేదని, జిల్లా అధికారులే సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తున్నారని, ఇదైన సరైన విధానం కాదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రయాణికుల పాట్లు

- ఉమ్మడి జిల్లా నుంచి కాకినాడ సీఎం సభకు 230 బస్సులు
- ముందస్తు సమాచారం నిల్
- స్టాపుల్లో గంటలకొద్దీ ప్రయాణికుల నిరీక్షణ
- అధికారుల తీరుపై మండిపాటు



సిద్ధం సభకు బస్సులు వేయడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ సిటీ బస్ షెల్టర్ వద్ద ప్రయాణికుల పడిగాపులు

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందన్నట్టుగా... అటు గుంటూరు నుంచి ఇటు శ్రీకాకుళం జిల్లా వరకూ ఎక్కడ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సభ నిర్వహించినా విశాఖపట్నం నుంచి బస్సులు తరలిస్తుండడం రివాజుగా మారింది. ఈ పర్యాయం కాకినాడ జిల్లాలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల సభకు ఉమ్మడి జిల్లా నుంచి ఏకంగా 230 బస్సులు పంపారు. ఇందులో అత్యధికం నగరంలోని డిపోలకు చెందిన సిటీ బస్సులు ఉన్నాయి. ఇందుకు సంబంధించి ప్రజా రవాణా శాఖ ముందుగా ఎటువంటి ప్రకటన చేయలేదు. దీంతో నగరంలో సిటీ బస్సులపై ఆధారపడే వారంతా శుక్రవారం నానా అగచాట్లు పడ్డారు.

ప్రధానంగా శివారు ప్రాంతాల నుంచి నగరానికి, నగరం నుంచి శివారు ప్రాంతాలకు సిటీ బస్సులపై వెళ్లే వారంతా బస్టాప్‌లలో గంటలకొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. ద్వారకా కాంప్లెక్స్ వెలుపల గల బస్టాప్‌లు, జాతీయ రహదారిపై గల పలు బస్టాప్‌లలో ప్రయాణికులు బస్సుల కోసం చూసి చూసి చివరకు ఆటోలకు ప్రయాణించారు. నెలవారీ పాస్‌లు తీసుకుని ఆటోలపై ప్రయాణించాల్సి వస్తోందని దువ్వాడకు చెందిన ఆడారి శ్రీనివాస్ మండిపడ్డారు. ఎండ తీవ్రతకు గంటకుపైగా బస్టాప్‌లో వేచి ఉండడంతో ఆరోగ్యపరంగా ఇబ్బందులు వస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. కాగా పెందుర్తి నుంచి ప్రతిరోజు ద్వారకానగర్‌లో బ్యాంకు కోచింగ్‌కు వస్తున్న జగన్‌సాయి అనే విద్యార్థి బస్సులు లేకపోవడంతో క్లాస్‌కు రెండు గంటల ఆలస్యం అయినట్టు చెప్పాడు. అది కూడా ఆటోలో రావడంతో ఒక్కరోజుకే రూ. 100 అయ్యిందన్నాడు. బస్సులు లేకపోవడంతో రూ.100 ఖర్చు పెట్టుకుని ఆటోలో రావాల్సి వచ్చిందని మధురవాడ నుంచి ప్రతిరోజు గేట్ కోచింగ్‌కు నగరానికి వచ్చే వరుణ్‌కుమార్ అనే యువకుడు వాపోయాడు. ఇప్పటికే పాస్ తీసుకున్న తనకు ఆటో చార్జీ అదనపు భారమన్నాడు. కాగా సీఎం సభకు కాకినాడ వెళ్లిన బస్సులు ఆదివారం తిరిగి వస్తాయని ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు. అంటే శనివారం కూడా నగరంలో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పకపోవచ్చు.

జన కేతనం

- పట్నంపై టీడీపీ పట్టు
- 'పశ్చిమ' ఫలితం తేల్చేది వారే
- ఎన్నికల ఖర్చుపై డేగ కన్ను
- పెందుర్తిలో... ఒకసారే చాన్స్!

10లో

అధిక లోడు వాహనాలపై కేసు నమోదు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్‌టీఏ సిబ్బంది

మురళీనగర్, ఏప్రిల్ 19 ; విశాఖ ఆర్టీఏ కార్యాలయ పరిధిలో రవాణా శాఖ అధికారులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా అధికలోడుతో వెళ్తున్న రెండు వాహనాలపై కేసులు నమోదు చేసినట్టు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనరు జి.సి.రాజారత్నం తెలిపారు. అధిక లోడుతో ప్రమాదాలు చోటుచేసుకుంటాయన్నారు. ఈస్థితిలో వాటిపై కఠిన చర్యలు తీసుతీసుకుంటున్నట్టు ఆయన వివరించారు. ఈ తనిఖీల్లో కె. శ్రీనివాస్, మాధవి, సుమన్ కుమార్ ఉన్నారు.

చిత్రలేఖనం పోటీలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

సీతంపేట, ఏప్రిల్ 19: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గ్రంథాలయ సొసైటీ, భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూలు సంయుక్తంగా ఆరు నుంచి 13 ఏళ్ల లోపు విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను, స్టోరీ టెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాల నుంచి 120 మంది పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వారు కళాత్మక ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ కథకురాలు సీతాశ్రీనివాస్ వాయిస్ ఆర్టిస్ట్ కథలను పాటలుగా పాడిస్తూ పిల్లలను కథలో లీనమయ్యే విధంగా చేశారు. విద్యార్థులకు పతకాలు, సర్టిఫికేట్స్‌ను అందచేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 19: నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. దాలిరాజు సూపర్‌మార్కెట్ ఏరియా, జగ్గారావు బ్రిడ్జి ఏరియా, యలమంచిలి వారి వీధి, ఇండియన ఓవర్‌సీస్ బ్యాంక్ ఏరియా, ఓల్డ్ పోస్టాఫీసు రోడ్డు, మ హారాణి పార్లర్ ఏరియా, శివరామరెడ్డి స్వీట్ షాప్ ఏరియాల్లో కరెంట్ ఉండదన్నారు.

సీతమ్మధార పరిధిలో..

సీతమ్మధార: విద్యుత్ సెక్షన్ ఆఫీస్ పరిధి 11కేవీ టీపీటీ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు జోన్- 1 ఈఈ బి.సింహాచలంనాయుడుతెలిపారు.టీపీటీ కాలనీ, ఎన్‌బీఎం లా కాలేజీ,రసపూర్ణ హోటల్ వెనుక ఉన్న ప్రాంతం, ఎ ఎస్ ఆర్ నగర్ , క్షత్రియ కళ్యాణమండపం, బిలాల్ కాలనీ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ చంద్రబాబుతో సాధ్యం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 19: అప్పులతో నిండిన రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారాలంటే మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని 31 వ వార్డు టీడీపీ నాయకుడు బత్తిన నవీన్ అన్నారు. 31 వ వార్డులో పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ఆలోచించి రూపొందించారన్నారు. కూటమి విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్‌లను గెలిపించాలన్నారు. వైసీపీ 36వ వార్డు కార్పొరేటర్ భర్త 36వ వార్డు వైసీపీ అధ్యక్షులు మాసిపోగు రాజుకు కూటమికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కోరారు. ఆర్జీ రాజేష్, టీడీపీ , జనసేన, కార్యకర్తలు పాల్గొన్నారు.



జనసేనలో చేరిన వారితో వంశీకృష్ణ



42వ వార్డులో ప్రచారం చేస్తున్న వంశీకృష్ణ సతీమణి పద్మజ

రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరం

» దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ

జ్ఞానాపురం, ఏప్రిల్ 19: రాష్ట్ర అభివృద్ధి కూటమి అభ్యర్థుల గెలుపుతోనే సాధ్యమవుతుందని దక్షిణ జనసేన వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం 32వ వార్డు పరిధిలోని నెరెళ్లకోనేరు ప్రాంతంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, స్థానిక కార్పొరేటర్ జనసేన నేత కందుల నాగరాజు తదతరుల ప్రచారం నిర్వహించారు. వంశీకృష్ణకు ప్రజలు పూలతో స్వాగతం పలికారు. ముందుగా జనసేన పార్టీ కార్యాలయం వద్ద ప్రచారం ప్రారంభించి, అల్లిపురం మార్కెట్, చలువతోట, నేరెళ్ల కోనేరు ప్రాంతాల్లో పర్యటించారు. రాష్ట్రంలో త్వరలో దుర్మార్గ పాలన అంతం కానుందని వారు అన్నారు. వార్డులో కల్యాణ మండం నిర్మాణాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జ్ఞానాపురంలోని బాబుకాలనీకి చెందిన వైసీపీ మహిళా కార్యకర్తలు వార్డు అధ్యక్షుడు అంతోని శేఖర్, నాయకులు గవర రమణ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు.

అక్కయ్యపాలెం: ప్రస్తుత రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల్లో టీడీపీ చం ద్రబాబు నాయుడు నాయకత్వం ఎంతైనా అవసరమని దక్షిణ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు.గ్రేటర్ 27వ వార్డు డైమండ్ పార్కులో శుక్రవా రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డైమండ్‌పార్కు వాకర్స్ అసోసియేషన్, జిమ్ అసోసియేషన్, లాఫింగ్ క్లబ్ సభ్యులను కలసి తనను ఎమ్మెల్యేగా, విశాఖ ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, టీడీపీ, జనసేన పార్టీల వార్డు అధ్యకులు అల్లూరి సత్యనారాయణరెడ్డి, గుండు సురేష్‌బాబు, బీజేపీ కో కన్వీనర్ కారాల మహేష్, టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

42వ వార్డులో వంశీకృష్ణ సతీమణి ప్రచారం

42వ వార్డు రైల్వేన్యూకాలనీ లక్ష్మీగణపతి ఆలయం సమీపంలో వంశీకృష్ణ సతీమణి పద్మజ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో ఐదు నామినేషన్లు దాఖలు

సీతమ్మధార, ఏప్రిల్ 19: నామినేషనల్ ప్రక్రియ రెండో రోజు శుక్రవారం ఉత్తర నియోజకవర్గం పరిధిలో ఐదుగురు అభ్యర్థులు దరఖాస్తులను సమర్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ డి. అఖిల, తహసీల్దార్ శ్రీరామమూర్తి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వైసీపీ అభ్యర్థి కన్నపురాజు కమ్మిల (కేకే రాజు) తన నామినేషన్ పత్రాలు రెండు సెట్లు సమర్పించారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఐఎన్‌సీ) అభ్యర్థిగా గొంప గోవిందరాజు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా సుమ కమ్మిల, రోణంకి చలపతి రావు, బొర్ర రమేష్ నామినేషన్లు అందజేశారు.

వాలీబాల్ టోర్నీ విజేత ఇంజనీరింగ్ జట్టు



ట్రోఫీతో విజేత జట్టు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 19: తూర్పుకోస్తారైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న వాల్తేరు డివిజన్ స్పోర్ట్సు మేళా అంతర్ డివిజనల్ పురుషుల వాలీబాల్ టోర్నీలో ఇంజనీరింగ్ శాఖ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. రైల్వే ప్రొటక్షన్ ఫోర్సు (ఆర్పీఎఫ్) రన్నరప్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో ఇంజనీరింగ్ 2-0 స్కోరుతో ఆర్పీఎఫ్‌పై విజయం సాధించింది. కాగా, మహిళల కేటగిరిలో ఆర్పీఎఫ్ విన్నర్స్ కాగా, మెకానికల్ సీ అండ్ డబ్ల్యూ రన్నరప్‌గా నిలిచింది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా, సీనియర్ డీఈఎన్ (కో ఆర్డినేషన్) ఏకే మహరాణా ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్సు ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్, వాలీబాల్ కార్యదర్శి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి పుట్టగతులుండవు

» ఉత్తరం బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు



ప్రచారంలో మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

మాధవధార, ఏప్రిల్ 19 ; విశాఖ ఉత్తర నియోజకవర్గంలో గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి పనుల ద్వారా ప్రజల ఆదరాభిమానం సొంతం చేసుకున్నట్టు జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి పెన్మెత్స విష్ణుకుమార్ రాజు అన్నారు. శుక్రవారం 49వ వార్డు హైవే రోడ్డులోని శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం నుంచి ఆయన ప్రచారం ప్రారంభించారు. శివుని ఆలయంలో పూజలు చేసిన అనంతరం బీజేపీ, జనసేన, టీడీపీ శ్రేణులతో కలసి సత్యానగర్ పరిసర ప్రాంతాల్లో ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికార పార్టీ అభ్యర్థి సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానని, కొన్ని వేల ఓట్ల మెజారిటీతో తనని ఓడిస్తానని వైసీపీ చేస్తున్న చాలెంజ్‌కు జూన్ 4వ తేదీన జవాబు వస్తుందన్నారు. ప్రస్తుత సీఎం జగన్ అమలు కాని హామీలతో విసిగిపోయిన జనం మే 13వ తేదీన జరిగే పోలింగ్‌కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ప్రజలను మోసం చేసిన వైసీపీకి పుట్టగతులు ఉండవు అని పేర్కొన్నారు. ప్రగతి కోసం ప్రజలు కూటమికి విజయాన్ని అందించాలని ఆయన కోరారు. మార్పుతో రా ష్ట్రంలో అభివృద్ధి ఎలా ఉంటుందో తెలుసుకోగలుగుతారన్నారు. ప్రజలకు కూటమి అమలు చేయనున్న మేనిఫెస్టోను వివరించారు. ఈ ప్రచారంలో జనసేన పార్టీ నుంచి సంకు. వెంకటేశ్వరరావు, బి.రఘు, తెలుగు మహిళా నాయకురాలు ఈతలపాక. సుజాత, బీజేపీ నాయకులు వంశీ యాదవ్, 50వ వార్డు నాయకులు సనపల.వరప్రసాద్, 49వ వార్డు టీడీపీ నాయకులు ఆయన వెంట వార్డు నాయకులు, మహిళలు, కార్యకర్తలు ఉన్నారు. ప్రచారంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్టీఆర్ వేషధారణలో బైక్ ర్యాలీ చేశారు.

ట్రాఫిక్ వలంటీర్లను నియమిస్తాం

» పోలీసు కమిషనర్ రవిశంకర్

మహారాణిపేట, ఏప్రిల్ 19: నగరంలో రోడ్డు ప్రమాదాల నిరోధంలో ట్రాఫిక్ పోలీసులు మరింత సమర్థంగా సేవలందించనున్నట్టు పోలీసు కమిషనర్ ఎ. రవి శంకర్ అయ్యన్నార్ తెలిపారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, మద్యం మత్తుతో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ పెద్దమొత్తంలో ట్రాఫిక్ గాడ్జెట్స్ (పరికరాలు)ను కొనుగోలు చేశారు. శుక్రవారం బీచ్‌రోడ్డులో సీపీ వాటిని ఆవి ష్కరించి పోలీసు సిబ్బందికి అందించారు. వీటిలో 200 బ్రీత్‌ఎనలైజర్లు, 200 వీల్‌లాక్స్ 200 బాడీ వార్న్ కెమెరాలు 400 రేడియమ్ జాకెట్లు, 400 బటన్‌లైట్లు ఉన్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలతో పలువురు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, వాటిని నివారించేందుకు పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసి ట్రాఫిక్ ట్రాఫిక్ ఎక్విప్‌మెంట్స్ కొనుగోలు చేసినట్టుచెప్పారు. మద్యం తాగి వాహనాలు నడపకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాంగ్ పార్కింగ్ చేసి న వారిపై వీల్ లాక్స్ ద్వారా అరికడతామని తెలిపారు. ట్రాఫిక్ సేవలు అం దిం చేందుకు



ట్రాఫిక్ నియంత్రణ సామగ్రి ఆవిష్కరిస్తున్న సీపీ రవిశంకర్ అయ్యన్నార్

స్వచ్ఛందంగా వచ్చిన వారిని వలంటీర్లుగా తీసుకొని వారికి శిక్షణ అందిస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం వారికి ప్రతీ మూడు కిలో మీటర్ల పరిధి లో సేవలందిస్తారన్నారు. వీరికి ఆర్థికంగా, సాంకేతికంగా పూర్తి సహాయం అందించనున్నట్టు వివరించారు.ఈ కార్యక్రమంలో అంధ విదార్థులు ఆరోగ్య సందేశాత్మక ప ద్యాలను ఆలపించారు. ఈకార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ ఓటమి ఖాయం

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ

» టీడీపీలో చేరిన వందలాదిమంది వైసీపీ కార్యకర్తలు



టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులతో శ్రీభరత్, గండిబాబ్జీ

మహారాణిపేట, ఏప్రిల్ 19: ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాష్ట్ర సచివాలయానికి, మాజీగా ముఖ్యమంత్రి జగన్ ఇంటి ముఖంపట్టడం ఖాయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గం నేత సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యంలో వందలాది మం ది వైసీపీ నాయకులు, కార్యాకర్తలు టీడీపీలో చేరారు. వారికి విశాఖ పార్లమెంట్ అభ్యర్థి ఎం. శ్రీ భరత్, గండిబాబ్జీలు కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాబ్జీమాట్లాడుతూ రాష్ట్రమంతటా వైసీపీకి వ్యతిరేక పవనాలు వీసు_్తన్నాయని, ప్రజలు మార్పును కోరుకుంటున్నారన్నారు. ఈస్థితిలో జగన్ ఓటమి ఖాయమన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబు ముఖ్య మంత్రిని చేయటానికి కృషి చేయాలని కోరారు. ˇనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరువ్యాపారులు నష్టపోయారు

సీతమ్మధార: వైసీపీ ప్రభుత్వంలో చిన్న వ్యాపారులు సైతం నష్టపోవాల్సిన పరిస్థితులు వచ్చాయని కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ విమర్శించారు. స్వయం ఉపాధి పొందుతూ మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించే వైశ్యులపై సైతం వైసీపీ ప్రభుత్వం దాడులకు పాల్పడిందని ఆరోపించారు. స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఉత్తర ఎమ్మెల్యే బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుతో కలిసి పాల్గొన్నారు. వ్యాపారులు పారిశ్రామిక వేత్తలను ప్రభుత్వం వేధింపులకు గురి చేసిందన్నారు. సమావేశంలో కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు గాది రాజు, ప్రతినిధులు కృష్ణారావు, పూడి తిరుపతి రావు, బీజేపీ జిల్లా అధ్య క్షుడు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మార్పు

» గిడ్డి ఈశ్వరికే చాన్స్?

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

తెలుగుదేశం పార్టీ పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి కిల్లు వెంకట రమేశ్‌నాయుడును మార్చాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. ఈ మేరకు టీడీపీ అరకులోయ పార్లమెంట్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్‌కు పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్య శుక్రవారం ఫోన్ ద్వారా తెలిపారు. అలాగే ప్రస్తుతం అభ్యర్థిగా ప్రకటించిన రమేశ్ నాయుడుకి, టికెట్ పొందబోయే మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి ఈ సమాచారాన్ని చేరవేయాలని ఆయన శ్రావణ్‌కుమార్‌కు సూచించారు.



గిడ్డి ఈశ్వరి

దీంతో శుక్రవారం మధ్యాహ్నం అభ్యర్థి మార్పుపై మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్.. రమేశ్‌నాయుడు, గిడ్డి ఈశ్వరిలతో వేర్వేరుగా మాట్లాడారు. పార్టీ అధిష్ఠానం తీసుకునే ఈ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని ఆయన సూచించారు. పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మార్పుపై మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి సంప్రతించగా... అభ్యర్థిని మార్పుతున్న విషయం నిజమేనని, అధిష్ఠానం సూచనలతో ఈ విషయాన్ని రమేశ్‌నాయుడు, గిడ్డి ఈశ్వరికి తెలిపానన్నారు.

నియోజకవర్గంపై పట్టు సాధించడమే కారణం

అనూహ్య రీతిలో స్థానిక టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రమేశ్‌నాయుడు మార్పు జరగడం ప్రస్తుతం మన్యంలో చర్చనీయాంశమైంది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి నియోజకవర్గంపై సంపూర్ణమైన పట్టు సాధించడమే ఇందుకు కారణమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. వాస్తవానికి నెల క్రితమే మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికే టికెట్ దక్కాల్సి ఉన్నా, నియోజకవర్గంలోని టీడీపీ సీనియర్ నేతలు వర్గాలుగా విడిపోవడం, తదితర కారణాలతో కొత్త వ్యక్తికి టికెట్ ఇస్తే బాగుంటుందని పార్టీ భావించింది. దీంతో ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి ఈ ఏడాది జనవరి 4న టీడీపీలో చేరిన కిల్లు వెంకట రమేశ్‌నాయుడుకి స్థానిక ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. అయితే నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేసి, పట్టు సాధించిన పార్టీ ఇన్‌చార్జికి టికెట్ దక్కకపోవడంపై నియోజకవర్గం ఐదు మండలాలకు చెందిన నేతలు అసంతృప్తి చెందారు. దీంతో రెబల్‌గా నైనా ఎన్నికల బరిలో దిగాలని గిడ్డి ఈశ్వరిని టీడీపీ శ్రేణులు కోరాయి. దీంతో ఆమె రెబల్‌గా బరిలోకి దిగాలని నిర్ణయించారు. ఇదే క్రమంలో టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన రమేశ్‌నాయుడు ఎన్నికల నేపథ్యంలో చేపడుతున్న చర్యలు, నియోజకవర్గంలోని స్థితిగతులపై నిర్వహించిన సర్వేలో ఆయనకు ప్రతికూలమైన ఫలితాలు వచ్చాయని తెలిసింది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గిడ్డి ఈశ్వరి అయితేనే గెలుపు ఖాయమనే ప్రచారం నియోజకవర్గంలో విస్తృతంగా జరగడంతో అభ్యర్థి మార్పుపై టీడీపీ అధిష్ఠానం మొగ్గుచూపింది. దీంతో గిడ్డి ఈశ్వరికే టికెట్ ఇస్తామని టీడీపీ అరకులోయ పార్లమెంట్ స్థానం అధ్యక్షుడు, మాజీ కిడారి శ్రావణ్‌కుమార్ ద్వారా అధిష్ఠానం చెప్పించింది. దీంతో ఆమె శనివారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌లను కలిసేందుకు వెళ్లనున్నారు.

వెలగపూడి ఆస్తులు రూ. 20,20,12,700

» ఆయన పేరుతో రూ.13.73 కోట్లు

» భార్య పేరిట రూ.6.47 కోట్లు

» అప్పులు రూ.2.45 కోట్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ తూర్పు నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే వెల గపూడి రామకృష్ణబాబుశుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. అఫిడవిట్‌లో ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలు పొందుపర్చారు.వెలగపూడి మొత్తం ఆస్తులు రూ. 13,73, 09,440,అతని సతీమణి సుజన పేరిట ఆస్తులు రూ.6,47,0 3,260 వెరసి రూ. 20,2012,700గా చూపించారు. వెలగపూడి వద్ద నగదు రూ. 2,69,200, వివిధ బ్యాంకుల్లోని పొదుపు ఖాతాలలో డిపాజిట్లు, ఇతర రూపేణా, రుణం కలిపి రూ. 2,89,50,151,సతీమణి సుజన వద్ద రూ.6,97,000 న గదు, బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్లు, రుణం అడ్వాన్స్‌లు రూ. 1,07,01,300గా చూపించారు. ఈ దంపతులకు మూడు వా హనాలు, బైక్ ఉంది. ఎంవీపీకాలనీలో ఇల్లు, పలుచోట్ల స్థలాలు కలిసి వెలగపూడి స్థిరాస్తి రూ. 13,70,40,240. భార్య సుజనపేరిట రూ. 6,40,06,260 విలువైన స్థిరాస్తులున్నాయి. వెలగ పూడికి రూ.1,42,80,000, భార్య సుజనకు రూ. 1,02, 87,553 అప్పులున్నాయి. వెలగపూడిపై 2019, 2020, 2022లో ఆరిలోవ, ఎయిర్‌పోర్టు, ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్లలో 4 కేసులునమోదైనట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

కేకే రాజు ఆస్తులు రూ.42,27,75,132

» భార్య పేరు మీద రూ7.19 కోట్లు

» అప్పులు రూ.20,36,28,977

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ నార్త్ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా కమ్మిల కన్నపరాజు, ఆయన భార్య కమ్మిల సుభ నామినేషన్ దాఖలు చేశారు. వీరిద్దరూ సమర్పించిన అఫిడవిట్‌లలో తమతోపాటు కుటుంబసభ్యుల పేరు మీద ఉన్న ఆస్తులు, అప్పులు కేసుల వివరాలను పేర్కొన్నారు. కేకే రాజుపై మూడు కేసులున్నాయి. అతనిపేరుపై చరాస్తులు రూ.13,48,50,132, భార్య సుమ పేరుపై రూ.2,02,08,386 ఉన్నాయి. ఇద్దరు పిల్లలుండగా, ఒక్కొక్కరి పేరు మీద రూ.46,573 చొప్పున ఆస్తులు ఉన్నట్టు చూపించారు. కేకే రాజు పేరు మీద రూ.28,79,25,000,భార్య పేరు మీద రూ. 5,17,87,000 స్థిరాస్తులున్నట్టు చూపించారు. కేకే రాజు పేరు మీద రూ.20,36,48,977 కోట్ల రుణాలుండగా, ఆయన భార్య పేరు మీద రూ. 1,51,32,122 రుణాలున్నాయి. కేకే రాజు వద్ద రూ.80,911, భార్య సుమ వద్ద రూ.45,513 నగ దు ఉన్నట్టు చూపించారు. ఇళ్లు, వాహనాలు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

అదీప్‌రాజ్ ఆస్తుల వివరాలు..

పెందుర్తి, ఏప్రిల్ 19: ప్రస్తుత ఎమ్మెల్యే, వైసీపీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శుక్రవారం నామినేషన్ సమర్పించారు. ఈఅఫిడవిట్‌లో ఆస్తులు, అప్పుల వివరాలను అందజేశారు. అదీప్‌రాజ్ పేరు మీదచరాస్తులు రూ. 2,11,22,608, స్థిరాస్తులు 2,01,69,650, ఇంప్రూవబుల్ ప్రాపర్టీ కింద రూ. 1,33,02,500గా చూపారు. ఈ మూడు కలిపి రెండూ కలిపి రూ.5,45,94,758. ఆయన భార్య శిరీష పేరు మీద చ రాస్తులు రూ.80,84,748, 70గ్రాముల బంగారం..దీని విలువ రూ4.90 లక్షలు, స్థిరాస్తులు రూ.40,43,000గా చూపారు. ఈ మొ త్తం కలిపి రూ.12,6,17,748. అదీప్‌రాజ్ అప్పులు కింద రూ.1,52, 47,990 చూపించారు. ప్రస్తుతం ఆయన చేతిలో రూ.94,500, శిరీష వద్ద రూ.54,000 ఉన్నట్టు పొం దు పరిచారు. అలాగే అదీప్‌రాజ్‌కు పినగాడిలో మామ గిఫ్ట్‌గా ఇచ్చి న స్థలం 72,745 చదరపు గజాలు. ప్రస్తుతం దీని విలువ 4,84,86.800. శిరీష పేరిట రాంపురంలో రెండుచోట్ల 8,792 చదరపు గజాల స్థలం, రుషికొండలో అన్‌డివైడడ్ షేర్ ల్యాండ్ 439 చదరపు గజాలు ఉన్నట్టు చూపారు. అదీప్‌రాజ్‌కుపినగాడి, అంతకాపల్లి, గొరపల్లిల్లో ఉన్న సుమారు ఆరెకరాలు రూ.35 ల క్షలుగా పేర్కొన్నారు. శిరీష పేరిట సుమారు 50 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది.

అదీప్‌రాజ్‌పై కేసులు

పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 402-2017, కొత్తవలసలో ఎఫ్ఐఆర్ సీ3సి-1242-2016 కేసులు, సీసీ 179-2018 ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ విశాఖ, సీసీ 293-2022 ఆ రోమెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ రైల్వే కోర్టు కేసులు ఉన్నట్టు చూపారు.

అనకాపల్లి జిల్లాలోకి జగన్ బస్సు యాత్ర

... 7వ పేజీ తరువాయి

మండలం గొడిచెర్ల చేరుకున్నారు. ఇక్కడ జాతీయ రహదారి పక్కన ఖాళీ పొలంలో బస చేసేందుకు (బస్సులోనే) ఏర్పాట్లు చేశారు.

నేడు గొబ్బూరులో బహిరంగ

శనివారం ఉదయం తొమ్మిది గంటలకు నక్కపల్లి మండలం గొడిచెర్ల నుంచి బస్సు యాత్రను కొనసాగిస్తారు. ఎలమంచిలి బైపాస్ మీదుగా మధ్యాహ్నం 12.30 గంటలకు అచ్యుతాపురం చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్న భోజనం అనంతరం కశింకోట మండలం తాళ్లపాలెం సమీపంలో గొబ్బూరు చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు అక్కడ ఏర్పాటుచేసే బహిరంగ సభలో పాల్గొంటారు. తరువాత తాళ్లపాలెం జంక్షన్, కశింకోట, కొత్తూరు, అనకాపల్లి, శంకరం, రేబాక మీదుగా అనకాపల్లి మండలం చిన్నయ్యపాలెం వద్ద రాత్రి బసకు చేరుకుంటారు.

సింహాచలం దేవస్థానాన్ని కలెక్టర్ చేతిలో పెడితే ఎలా!?

... 7వ పేజీ తరువాయి

చేసినా ధర్మకర్తకు కనీసం సమాచారం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం గురించి చెప్పలేదని, అందులో తీసుకున్న నిర్ణయాలు కూడా తనకు తెలియజేయలేదన్నారు. ఇవన్నీ చూస్తుంటే..శ్రీవరహా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం స్వయం ప్రతిపత్తిని, కీర్తిని కావాలనే దెబ్బతీస్తున్నట్టుగా ఉందని, అలాంటి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

రెండో రోజు 28 నామినేషన్లు

... 7వ పేజీ తరువాయి

నామినేషన్లు దాఖలు చేశారు. సెగ్మెంట్‌ల వారీగా పరిశీలిస్తే..భీమిలికి స్వతంత్ర అభ్యర్థులుగా బుగత రాము, నాగామమి నాగోతు ఒక్కొక్క సెట్, విశాఖ తూర్పు నియోజకవర్గానికి టీడీపీ తరపున వెలగపూడి రామకృష్ణబాబు, ఆయన సతీమణి సుజన రెండేసి సెట్లు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఇ.హైమావతి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. విశాఖ ఉత్తరం నియోజకవర్గానికి వైసీపీ నుంచి కేకే రాజు రెండు సెట్లు, కాంగ్రెస్ నుంచి జి.గోవిందరాజు, స్వతంత్రులుగా బొర్రా రమేష్,సుమ, రోణంకి చలపతిరావు ఒక్కొక్క సెట్, విశాఖ పశ్చిమకు వైసీపీ తరపున ఆడారి ఆనంద్‌కుమార్ రెండు సెట్లు, జైభారత్ నేషనల్ పార్టీ నుంచి జె.వెంకటగణేష్ ఒక సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. పెందుర్తి అసెంబ్లీ స్థానానికి వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, జనసేన నుంచి పంచకర్ల రమేష్‌బాబు, పంచకర్ల మహాలక్ష్మి, జైభారత్ నేషనల్ పార్టీ తరపున కె.మహదేవ్ కల్యాణ్‌శ్రీకాంత్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఈత రోజా, సమాజ్‌వాదీ పార్టీ నుంచి బోళెం వెంకట మురళీమోహన్, ఇండిపెండెంట్లుగా ఆడారి నాగరాజు, గుంటూరు వెంకటనరసింహామూర్తి, గుంటూరు సాయిప్రియ, కూండ్రపు సన్యాసిరావు ఒక్కొక్క సెట్ నామినేషన్ దాఖలు చేశారు. గాజువాక, విశాఖ దక్షిణ నియోజకవర్గాలకు రెండో రోజు కూడా ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు.

సమస్యలు ఇవీ.. పరిష్కారం చూపరూ..!

మ్యాన్‌హోల్ నుంచి మురుగు

అక్కయ్యపాలెం: గ్రేటర్ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో మ్యాన్‌హోల్ నిండి ము రుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో దు ర్వాసనకుముక్కు మూసుకు రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. చాలా రోజులుగా మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా, జీవీఎంసీ సిబ్బంది సరైన చర్యలు చేపట్టడంలేదని ఆరోపిస్తున్నారు.



43వ వార్డులో శ్రీనివాసనగర్‌లో రోడ్డుపై మురుగు

ప్రయాణం... ప్రమాదకరం

జగదాంబ కూడలి, ఏప్రి ల్ 19: రద్దీగా ఉండే కేజీహెచ్ పోలీస్ క్వార్టర్స్ నుంచి లేపాక్షి మెయిన్ రోడ్డుకు కలిపే కుమ్మరవీధి రహదారి శిథిలావస్థకు చేరింది. ఈమార్గంలో నిత్యం సాలిపేట, జెండా జెట్టు , పోలీస్ క్వార్టర్స్, కేజీహెచ్‌కు వెళ్లేందుకు వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. గత ప దేళ్లుగా ఈ రహదారిపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్, కార్పొరేటర్ కోడూరి అప్పలరత్నం శ్రద్ధ తీసుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం జీవీఎంసీ వాహనాల రాకపోకలు సాగిస్తున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోలేదంటున్నారు.



కేజీహెచ్ డౌన్ పోలీస్ క్వార్టర్స్ నుంచి లేపాక్షికి వెళ్లే రహదారి దుస్థితి..

పార్కింగ్ ఫీజు బాదుడు

ఉక్కునగరంలో ఇష్టారాజ్యంగా ద్విచక్ర వాహనదారుల నుంచి వసూలు

ఫిర్యాదులందినా నిర్వాహకులపై చర్యలు చేపట్టని అధికారులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 19: స్టీల్‌ప్లాంట్ ఆర్చి (కూర్మన్నపాలెం జంక్షన్) వద్ద పార్కింగ్ దోపిడీ కొనసాగుతుంది. వాహనదారుల నుంచి ఇష్టానుసారంగా నిర్వాహకులు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఎవరైనా పార్కింగ్ రుసుము గురించి ప్రశ్నిస్తే దురుసుగా సమాధానం చెప్పడంతో పాటు అలాంటప్పుడు ఇక్కడ ఎందుకు పార్కింగ్ ఎందుకు చేస్తున్నారంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న వారు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే తమ ద్విచక్ర వాహనాలపై స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్దకు వచ్చి ఇక్కడ పార్కింగ్ చేసి వెళ్లి వస్తుంటారు. ఇలా వాహనాలను పార్కింగ్ చేసేందుకు గాను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం స్థలం కేటాయించి షెడ్లు నిర్మించింది. పార్కింగ్ నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. అయితే ఇక్కడ వాహనాలను పార్కింగ్ చేసిన వారి వద్ద నుంచి నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అధిక మొత్తంలో నగదు వసూలు చేస్తున్నారని పలువురు గగ్గోలు పెడుతున్నారు.



పార్కింగ్ స్టాండ్ వద్ద మొక్కుబడిగా ఉన్న చార్జీల వివరాలు

గతంలో ఇక్కడ అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఉక్కు అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో అధికారులు స్పందించి పార్కింగ్ స్థలం వద్ద ఫీజుల ధరలు తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ నిర్వాహకులు అక్కడి బోర్డుపై ఉన్న ధరల కన్నా అధికంగానే వసూలు చేస్తుండడం గమనార్హం. బోర్డుపై పేర్కొన్న దానికి విరుద్ధంగా ఎందుకు అధికంగా నగదు వసూలు చేస్తున్నారని ఎవరైనా నిర్వాహకులను ప్రశ్నిస్తే.. ఇష్టమైతే ఇక్కడ వాహనం పార్కింగ్ చేయండి, లేకుంటే చేయవద్దంటూ దురుసుగా సమాధానం చెబుతున్నారని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఈ విషయమై సంబంధిత విభాగ అధికారులను సంప్రదిస్తే.. ఎవరూ అధికంగా నగదు చెల్లించరాదని, బోర్డులో పేర్కొన్న మాదిరిగానే పార్కింగ్ ఫీజు చెల్లించాలని సూచిస్తున్నారే తప్ప అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న నిర్వాహకులపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కింగ్ ఫీజు బాదుడుకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



గోతులమయమైన భెల్ బీహెచ్‌పీవీ టౌన్‌షిప్ రోడ్డు

రహదారుణం!

ప్రమాదాలకు నిలయంగా మారిన భెల్ హెచ్‌పీవీపీ టౌన్‌షిప్ రోడ్డు

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కార్మికుల ఆవేదన

రహదారికి మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 19: భెల్ హెచ్‌పీవీపీ టౌన్‌షిప్‌లోకి వెళ్లే ప్రధాన రహదారి పెద్దపెద్ద గోతులతో ప్రమాదాలకు నిలయంగా మారింది. జాతీయ రహదారి నుంచి భెల్ టౌన్‌షిప్‌లోకి వెళ్లే ఈ మార్గం మొత్తం ఛిద్రం తయారవ్వడంతో కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డు గుండానే భెల్ అధికారులు, కార్మికులు, తుంగ్లాం పరిసర ప్రాంతాల ప్రజలు రోజూ వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. గోతులతో నిండిన ఈ రహదారిలో నిత్యం రాకపోకలు చేస్తుండడం వల్ల తమ ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఎప్పటికప్పుడు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాపోతున్నారు.

గోతులకు భయపడి ఈ రహదారిలో ఉన్న కాలిబాట మార్గంలో ద్విచక్ర వాహనాలును నడపడం, ప్రధాన రోడ్డుపై పాదచారులు రాకపోకలు సాగించడం పరిపాటిగా మారింది. ఈ రోడ్డంతా గోతులమయమై ఏళ్లు గడుస్తున్నా భెల్ యాజమాన్యం పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఈ రహదారిని బాగు చేయాలని కార్మిక నాయకులు భెల్ యాజమాన్యానికి ఎన్నిమార్లు వినతులు అందించినా ఫలితం లేకుండా పోయిందని కార్మికులతో పాటు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టౌన్‌షిప్‌లో మాత్రం పలుచోట్ల గోతులను సిమెంట్ కాంక్రీట్‌తో తాత్కాలికంగా ప్యాచ్ వర్క్ చేసినప్పటికీ అవి కొద్ది రోజులకే యథావిధిగా గోతులమయమవుతున్నాయి. వర్షాల సమయంలో ఈ రోడ్డులోని గోతుల్లో నీరు చేరు చేరడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు కార్మికులు ఆవేదన చెందుతున్నారు. అందువల్ల భెల్ మాజమాన్యం స్పందించి టౌన్‌షిప్ ప్రధాన రహదారితో పాటు క్వార్టర్స్‌లోని రోడ్లకు మరమ్మతులు చేయించవలసిందిగా వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న రోడ్డు

అట్టహాసంగా ఆడారి నామినేషన్



నూకాలమ్మ సన్నిధిలో వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదగా నామినేషన్ పత్రాలు తీసుకుంటున్న ఆనంద్‌కుమార్

గోపాలపట్నం, ఏప్రిల్ 19: వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా ఆయన గోపాలపట్నంలోని నూకాలమ్మ ఆలయానికి ఉదయం చేరుకుని అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదగా నామినేషన్ పత్రాలను ఆనంద్‌కుమార్ అందుకున్నారు. ఆ తర్వాత నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వందలాది మంది నాయకులు, కార్యకర్తలు అభిమానులతో భారీ ర్యాలీతో గోపాలపట్నం నుంచి జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆఫీసుకు చేరుకున్నారు. అనంతరం ఉదయం 11.30 గంటలకు నామినేషన్ పత్రాలను ఈఆర్వో, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ రెహమాన్, జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, నాయకులు పేడాడ రమణికుమారి, అయితంశెట్టి గోపి, డొడ్డి కిరణ్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆనంద్‌కుమార్, బొత్స ఝాన్సీలను గెలిపించండి: ఆడారి సోదరి రమాకుమారి

మల్కాపురం: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించవలసిందిగా ఆడారి సోదరి,

వందలాది మందితో ఆనంద్‌కుమార్ ర్యాలీ

ఎలమంచిలి మునిసిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి కోరారు. ఇక్కడి నగరాల వీధిలో నగర కులస్థులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వైసీపీ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల సుధ, కుల పెద్దలు బోగవిల్లి నాగభూషణం, ఎం.అప్పారావు, ఎం.వెంకటరావు, బి.నాగేశ్వరరావు, నూకరాజు, వాసు, పి.జయశంకర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రమాకుమారిని కులపెద్దలు ఘనంగా సత్కరించారు.



ర్యాలీగా ఈఆర్వో కార్యాలయానికి బయలుదేరిన ఆడారి ఆనంద్‌కుమార్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఆడారి సోదరి రమాకుమారి



శ్రీవారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 19: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి సమీపంలోని రాజులపాలెంలో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ 24వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ప్రధాన అర్చకులు కోగంటి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో సుప్రభాత సేవ, ప్రథమ ఆరాధన, మహా కుంభ ప్రోక్షణ, ప్రాణ ప్రతిష్ఠ, ప్రత్యేకంగా శ్రీవారిని అలంకరించాక పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, విశేష హోమాలు జరిపారు. అనంతరం లోక కల్యాణార్థం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం ఆలయం వద్ద మహిళలు అన్నమాచార్యుల గీతాలకు కోలాటం ఆడారు. శ్రీదేవి, భూదేవి, శ్రీనివాసుల చరిత్రను నృత్యరూపకం ద్వారా వివరించారు. సాయంత్రం శ్రీవారిని సూర్యప్రభ వాహనంపై ఆశీనులను చేసి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

అగనంపూడి, ఏప్రిల్ 19: ఏపీఈపీడీసీఎల్ లంకెలపాలెం సెక్షన్ కార్యాలయం పరిధి పెదముషిడివాడ 33/11 కేవీ సబ్ స్టేషన్ వద్ద శనివారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేసినట్టు సంస్థ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ఈ వేదికలో చర్చించడం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి విశ్రాంత న్యాయమూర్తి, కన్జ్యూమర్ గ్రీవెన్స్ రెసిడెన్షియల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) ఛైర్మన్ బి.సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. వినియోగదారులంతా ఈ వేదికలో పాల్గొని విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాల్సిందిగా రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

అప్పన్న వార్షిక కల్యాణోత్సవంలో వాహన సేవలు

సింహాచలం, ఏప్రిల్ 19: వరాహలక్ష్మీనృసింహుని వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రతిరోజూ ఒక వాహనంపై బేడా మండపంలో లేదా మాడవీధుల్లో తిరువీధి నిర్వహిస్తారు. ఈ నెల 20న సాయంత్రం 5 గంటలకు శేష వాహనంపై మాడవీధుల్లో తిరువీధి, 21న సాయంత్రం 6 గంటలకు సర్వజన మనోరంజని వాహనంపై మాడవీధుల్లో తిరువీధి, 22న సాయంత్రం 5 గంటలకు సూర్యప్రభ వాహనంపై, 23న ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు పల్లకిలో తిరువీధి, రాత్రి 9 గంటలకు మృగయోత్సవం (దొంగల దోపు) సందర్భంగా అశ్వ వాహనంపై తిరువీధి, 24న ఉదయం 8 గంటలకు వినోదోత్సవం జరగనున్నాయి.

నేడు కార్యక్రమాలు

వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాల్లో ఆది వారం వేకువజామున నాలుగు గంటలకు సుప్రభాత సేవ, ప్రభాతారాధన, విశేష హోమాలు, బాలభోగం నివేదన, గ్రామ బలిహరణం, ఉదయం 7.30 గంటలకు మంగళ శాసనం ఉంటుంది. మధ్యాహ్నం 11.30 గంటల వరకు భక్తులకు సర్వదర్శనాలు, 11.30 నుంచి 12.30 వరకు మహా నివేదన, 12.30 నుంచి 2.30 వరకు దర్శనాలు, 2.30 నుంచి 3 వరకు పవళింపు సేవ, దర్శనల నిలుపుదల, సాయంత్రం 5 గంటలకు శేష వాహనంపై మాడవీధుల్లో స్వామివారి తిరువీధి జరగనుంది. రాత్రి 7 గంటలకు రాత్రి ఆరాధన, విశేష హోమాలు, దర్శనాల నిలుపుదల, రాత్రి 10 గంటలకు ప్రత్యేక నివేదన, గ్రామ బలిహరణం, మంగళాశాసనం, పవలింపు సేవ, కవాట బంధనం చేయనున్నారు.

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

పదో రోజుకు గంగవరం పోర్టు కార్మికుల ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న కార్మికులు

తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు కొనసాగిస్తామని స్పష్టీకరణ

'అదానీ గంగవరం'లో స్తంభించిన పనులు

పెదగంట్యాడ, ఏప్రిల్ 19: న్యాయ సమ్మతమైన తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ అదానీ గంగవరం పోర్టు కార్మికులు చేపట్టిన ఆందోళన శుక్రవారం నాటికి పదో రోజుకు చేరుకుంది. గంగవరం పోర్టు యాజమాన్యం దిగిరాకపోవడం, కార్మికులు పట్టు విడవకపోవడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. కార్మికులంతా సమ్మెబాట పట్టడంతో పోర్టులో పనులు ఎక్కడికక్కడ స్తంభించిపోయాయి. కార్మికులకు కనీస వేతనంగా రూ.36 వేలు చెల్లించాలని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలు కల్పించాలని, ప్రమాద బీమా, కార్మిక చట్టాన్ని అనుసరించి ఇతర అలవెన్సులు అందజేయాలని వారు కోరుతున్నా.. యాజమాన్యం కనీసం స్పందించడం లేదని పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పేర్కొంటున్నారు. కార్మిక చట్టాలను అమలు చేయకుంటే పోర్టు నిర్వాసితులకు రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పోర్టు మెయిన్ గేటు దగ్గర శుక్రవారం చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు ఆందోళనలను విరమించబోమని వారు స్పష్టం చేస్తున్నారు. కాగా గంగవరం పోర్టు కార్మికులకు వివిధ రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలు సంఘీభావం ప్రకటించాయి.

సిద్ధం సభకు బస్సులు: ప్రయాణికులకు తప్పని తిప్పలు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 19: కాకినాడ జిల్లా పిఠాపురంలో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభకు జనాలను తరలించేందుకుగాను స్టీల్ సిటీ డిపో కూర్మన్నపాలెం నుంచి 35 ఆర్టీసీ బస్సులను వినియోగించారు. దీంతో ఇక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ ప్రయాణికులు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గంటల తరబడి బస్సుల కోసం వేచిచూసినా ఫలితం లేకపోవడంతో పలువురు తమ గమ్య స్థానాలకు రైళ్లలో బయలుదేరి వెళ్లారు. మరికొందరు తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. జగన్ పర్యటన అంటే ప్రజలకు ఇక్కట్లు అన్నది షరామామూలుగా మారిందని పలువురు విమర్శించారు.



కూర్మన్నపాలెంలో బస్సుల కోసం వేచివున్న ప్రయాణికులు

బస్సులు లేక ప్రయాణాన్ని రద్దు చేసుకున్నాం

-కృష్ణకుమారి, గృహిణి



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వెళదామని బస్సు కోసం ఎదురుచూశాం. ఎంతసేపు వేచి ఉన్నా బస్సులు రాలేదు. అందుకు గల కారణాల గురించి ఆరా తీయగా చాలా బస్సులను సిద్ధం సభకు పంపినట్టు తెలిసింది. దీంతో మ ప్రయాణాన్ని రద్దు చేసుకుని ఇంటికి వెళ్లిపోయాం. ప్రజాప్రతినిధుల సభల కోసం బస్సులను తరలించి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదు.

బోర్ల మరమ్మతులకు అధికారుల చర్యలు

గాజువాక, ఏప్రిల్ 19: వేసవిని దృష్టిలో పెట్టుకుని గాజువాక నియోజకవర్గ పరిధిలో మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్న బోర్లకు మరమ్మతులు చేపట్టేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఏఏ వార్డుల్లో ఎన్ని బోర్లు మరమ్మతులకు గురయ్యాయో వాటర్ వర్క్స్ సిబ్బంది ద్వారా సర్వే చేపట్టారు. వేసవిలో తాగునీటి సరఫరా అంతంతమాత్రంగానే ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పలు కారణాల వల్ల ఒక్కొక్కసారి రెండు, మూడు రోజుల పాటు నీరు సరఫరా జరగని పరిస్థితి నెలకొంటుంది. అటువంటి సమయంలో ప్రజలు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఒకపక్క కొళాయిల్లో తాగునీటి సరఫరా కాకపోవడం.. మరోపక్క బోర్లు మూలకు చేరడంతో పలు వార్డుల్లోని ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఈ నేపథ్యంలో వార్డుల్లో నిరుపయోగంగా ఉన్న బోర్లను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు.

ఇందుకు సంబంధించి ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేశారు. ఈ అంశాన్ని గ్రేటర్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన బోర్లకు మరమ్మతులు చేపట్టనున్నారు. ఆయా వార్డుల్లోని బోర్లన్నీ అందుబాటులోకి వస్తే తాగునీటి ఇబ్బందులు కాస్త తగ్గుతాయని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం

సర్దార్ గౌతు లచ్చన్నకు నివాళి

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 19: స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి దివంగత సర్దార్ గౌతు లచ్చన్న అందించిన సేవలు చిరస్మరణీయమని టీడీపీ నాయకుడు ఎస్ఎస్ విజయరామరాజు అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలో శుక్రవారం గౌతు లచ్చన్న 18వ వర్ధంతిని రథాలమ్మ శెట్టిబలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా ఇక్కడి గౌతు లచ్చన్న విగ్రహం ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయరామరాజు మాట్లాడుతూ దేశంలో కోసం ఆంగ్లేయులతో పోరాడి గౌతు లచ్చన్న అనేకసార్లు జైలుకు కూడా వెళ్లారన్నారు. బీసీలు, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలు అజరామమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు గెద్దాడ రాంబాబు, పోతల కృష్ణ, అప్పారావు, అప్పన్న, అప్పలస్వామి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కృషి చేస్తా..

వైసీపీ నిర్ణయాల వల్లే కర్మాగారానికి ఈ దుస్థితి

టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 19: ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కృషి చేస్తానని, నాడు ప్లాంట్ బీఐఎఫ్ఆర్‌కు వెళ్లకుండా ఎలాగైతే కాపాడేమో, ఇప్పుడు కూడా స్టీల్‌ప్లాంట్‌ను రక్షించు కుంటామని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ రోడ్డు వద్ద ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించటమే మా ప్రధాన లక్ష్యమన్నారు. ప్లాంట్ కోసం ఏడు రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఉద్యమానికి ఊపిరి పోశానన్నారు. హుద్‌హుద్ సమయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో కేవలం ఒకరోజు వ్యవధిలోనే ప్లాంట్‌కు విద్యుత్ సరఫరా అం దించామన్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్ణయాల వల్లే ప్లాంట్‌కు ఈ స్థితి వచ్చిందని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులతో ఒకరోజు కూడా మాట్లాడని మంత్రి, వైసీపీ గాజువాక అభ్యర్థి అమర్‌నాథ్‌కు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పల్లా శ్రీనివాసరావు వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆ తర్వాత సెక్టార్-1 నుంచి సెక్టార్-6 మీదగా ఉక్కు ఆస్పత్రి, టౌన్ అడ్మిన్ విభాగాల వద్ద ప్రచారం చేపట్టారు. టీడీపీ వార్డు ఇన్‌చార్జి అడుసుమల్లి దీప్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు, నాయకులు విళ్లా రామ్మోహన్‌కుమార్, గడసాల అప్పారావు, జి.వెంకటరావు, సోమన్న, నాగేశ్వరరావు, ఉగ్రం, మణికుమార్, జోషి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఓడించి విశాఖను కాపాడాలి

టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా: గణబాబు

మల్కాపురం, ఏప్రిల్ 19: వైసీపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధిలో విశాఖ అన్ని విధాల వెనకబడిపోయిందని తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ ఆవేదన వ్యక్తం చేశారు. 58వ వార్డు ఎదురువానిపాలెం, గొందేశివానిపాలెం, ములగాడ గ్రామాల్లో ఆయన పాటు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ వైసీపీ నమ్ముకుంటే విశాఖకు మరింత అన్యాయం జరుగుతుందన్నారు. అందువల్ల మే 13న జరగ నున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను ఓడించి విశాఖను కాపాడవలసిందిగా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బీసీ డిక్లరేషన్, సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. గణబాబు మాట్లాడుతూ స్థానికునిగా తనకు నియోజకవర్గ సమస్యలపై ఎంతో పట్టు ఉందని, స్థానికేతరులకు ఎలాంటి అవగాహన ఉండదన్నారు. అందువల్ల స్థానికులే ముద్దు, స్థానికేతరులు వద్దు అని అన్నారు. నిత్యం తాను ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనతో పాటు శ్రీభరత్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాగా ఇరువురి అభ్యర్థులకు మహిళలు పువ్వులు చల్లి హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 58వ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, జనసేన పశ్చిమ ఇన్‌చార్జి అంగ దుర్గాప్రశాంతి, నాయకులు కాకి పోలిరెడ్డి, మూర్తి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో గణబాబు, శ్రీభరత్‌లకు హారతిస్తున్న మహిళ

సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

అగనంపూడి, ఏప్రిల్ 19: అగనంపూడి ట్రాఫిక్ సిగ్నల్ వద్ద స్థానిక సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జనని సోషల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు విందుల వెంకటరమణ ముఖ్య అతిథిగా విచ్చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సత్యసాయి భజన మండలి చేస్తున్న సేవా కార్యక్రమాలు విశేషమైనవన్నారు.

ఈ కార్యక్రమలో స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, భజన మండలి ప్రతినిధులు రామకృష్ణ, వి.వరహాలు, పట్టా రామ అప్పారావు, సత్యనారాయణ, ఎస్.సన్యాసిరావు, పైడిరాజు, బి.అప్పారావు, సుశీల గజేంద్రరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ డీ-బ్లాక్‌లో..

ఆటోనగర్: వేసవి దృష్ట్యా ఆటోనగర్ డీ-బ్లాక్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ఐలా మాజీ ఛైర్మన్ ఎస్.శేషగిరిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐలా ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ పర్యవేక్షణలో 45 రోజులపాటు ఈ చలివేంద్రం ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు, కార్మికులకు అందుబాటులో ఉంటుందన్నారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా పారిశ్రామికవేత్తల సహకారంతో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలు, కార్మికుల దాహార్తిని తీరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ ఏడీ ప్రభాకర్ కుమార్, బేగ్, వినోద్‌కుమార్, రామకృష్ణ, శ్రీను, నూకరాజు, లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి నియోజకవర్గ పరిధిలో 11 నామినేషన్లు స్వీకరణ

పెందుర్తి, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసులో శుక్రవారం 11 నామినేషన్లను స్వీకరించారు. ప్రస్తుత ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పంచకర్ల రమేశ్‌బాబు (జనసేన), పంచకర్ల మహాలక్ష్మి (జనసేన), గుంటూరు వెంకట నరసింహరావు (స్వతంత్ర), గుంటూరు సాయిప్రియ (స్వతంత్ర), ఆడారి నాగరాజు రెండు సెట్లు (స్వతంత్ర), ఈత రోజా (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), బోలెం వెంకట మురళీమోహన్ (సమాజ్‌వాద్ పార్టీ), కూండ్రపు సన్యాసిరావు (స్వతంత్ర), కన్నేపల్లి మహాదేవ (జై భారత్ నేషనల్ పార్టీ) నామినేషన్లు వేశారు. కూటమి తరపున జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు తరపున ఆయన సోదరుడు వెంకటేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో కార్యాలయ పరిసరాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

అధిక లోడు వాహనాలపై కేసు నమోదు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్టీఏ సిబ్బంది

మురళీనగర్, ఏప్రిల్ 19 ; విశాఖ ఆర్టీఏ కార్యాలయ పరిధిలో రవాణా శాఖ అధికారులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా అధికలోడుతో వెళ్తున్న రెండు వాహనాలపై కేసులు నమోదు చేసినట్టు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనరు జి.సి.రాజారత్నం తెలిపారు. అధిక లోడుతో ప్రమాదాలు చోటుచేసుకుంటాయన్నారు. ఈస్థితిలో వాటిపై కఠిన చర్యలు తీసుతీసుకుంటున్నట్టు ఆయన వివరించారు. ఈ తనిఖీల్లో కె. శ్రీనివాస్, మాధవి, సుమన్ కుమార్ ఉన్నారు.

చిత్రలేఖనం పోటీలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

సీతంపేట, ఏప్రిల్ 19: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గ్రంథాలయ సొసైటీ, భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూలు సంయుక్తంగా ఆరు నుంచి 13 ఏళ్ల లోపు విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను, స్టోరీ టెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాల నుంచి 120 మంది పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వారు కళాత్మక ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ కథకురాలు సీతాశ్రీనివాస్ వాయిస్ ఆర్టిస్ట్ కథలను పాటలుగా పాడిస్తూ పిల్లలను కథలో లీనమయ్యే విధంగా చేశారు. విద్యార్థులకు పతకాలు, సర్టిఫికేట్స్‌ను అందచేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 19: నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. దాలిరాజు సూపర్‌మార్కెట్ ఏరియా, జగ్గారావు బ్రిడ్జి ఏరియా, యలమంచిలి వారి వీధి, ఇండియన ఓవర్‌సీస్ బ్యాంక్ ఏరియా, ఓల్డ్ పోస్టాఫీసు రోడ్డు, మ హారాణి పార్లర్ ఏరియా, శివరామరెడ్డి స్వీట్ షాప్ ఏరియాల్లో కరెంట్ ఉండదన్నారు.

సీతమ్మధార పరిధిలో..

సీతమ్మధార: విద్యుత్ సెక్షన్ ఆఫీస్ పరిధి 11కేవీ టీపీటీ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు జోన్- 1 ఈఈ బి.సింహాచలంనాయుడుతెలిపారు.టీపీటీ కాలనీ, ఎన్‌బీఎం లా కాలేజీ,రసపూర్ణ హోటల్ వెనుక ఉన్న ప్రాంతం, ఎ ఎస్ ఆర్ నగర్ , క్షత్రియ కళ్యాణమండపం, బిలాల్ కాలనీ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ చంద్రబాబుతో సాధ్యం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 19: అప్పులతో నిండిన రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారాలంటే మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని 31వ వార్డు టీడీపీ నాయకుడు బత్తిన నవీన్ అన్నారు. 31 వ వార్డులో పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ఆలోచించి రూపొందించారన్నారు. కూటమి విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్‌లను గెలిపించాలన్నారు. వైసీపీ 36వ వార్డు కార్పొరేటర్ భర్త 36వ వార్డు వైసీపీ అధ్యక్షులు మాసిపోగు రాజుకు కూటమికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కోరారు. ఆర్టీ రాజేష్, టీడీపీ, జనసేన, కార్యకర్తలు పాల్గొన్నారు.



జనసేనలో చేరిన వారితో వంశీకృష్ణ



42వ వార్డులో ప్రచారం చేస్తున్న వంశీకృష్ణ సతీమణి పద్మజ

రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరం

▸▸ దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ

జ్ఞానాపురం, ఏప్రిల్ 19: రాష్ట్ర అభివృద్ధి కూటమి అభ్యర్థుల గెలుపుతోనే సాధ్యమవుతుందని దక్షిణ జనసేన వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం 32వ వార్డు పరిధిలోని నెరెళ్లకోనేరు ప్రాంతంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, స్థానిక కార్పొరేటర్ జనసేన నేత కందుల నాగరాజు తదితరుల ప్రచారం నిర్వహించారు. వంశీకృష్ణకు ప్రజలు పూలతో స్వాగతం పలికారు. ముందుగా జనసేన పార్టీ కార్యాలయం వద్ద ప్రచారం ప్రారంభించి, అల్లిపురం మార్కెట్, చలువతోట, నేరెళ్ల కోనేరు ప్రాంతాల్లో పర్యటించారు. రాష్ట్రంలో త్వరలో దుర్మార్గ పాలన అంతం కానుందని వారు అన్నారు. వార్డులో కల్యాణ మండం నిర్మాణాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జ్ఞానాపురంలోని బాబుకాలనీకి చెందిన వైసీపీ మహిళా కార్యకర్తలు వార్డు అధ్యక్షుడు అంతోని శేఖర్, నాయకులు గవర రమణ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు.

అక్కయ్యపాలెం: ప్రస్తుత రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల్లో టీడీపీ చం ద్రబాబు నాయుడు నాయకత్వం ఎంతైనా అవసరమని దక్షిణ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు.గ్రేటర్ 27వ వార్డు డైమండ్ పార్కులో శుక్రవా రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డైమండ్‌పార్కు వాకర్స్ అసోసియేషన్, జిమ్ అసోసియేషన్, లాఫింగ్ క్లబ్ సభ్యులను కలసి తనను ఎమ్మెల్యేగా, విశాఖ ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, టీడీపీ, జనసేన పార్టీల వార్డు అధ్యకులు అల్లూరి సత్యనారాయణరెడ్డి, గుండు సురేష్‌బాబు, బీజేపీ కో కన్వీనర్ కారాల మహేష్, టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

42వ వార్డులో వంశీకృష్ణ సతీమణి ప్రచారం

42వ వార్డు రైల్వేన్యూకాలనీ లక్ష్మీగణపతి ఆలయం సమీపంలో వంశీకృష్ణ సతీమణి పద్మజ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో ఐదు నామినేషన్లు దాఖలు

సీతమ్మధార, ఏప్రిల్ 19: నామినేషనల్ ప్రక్రియ రెండో రోజు శుక్రవారం ఉత్తర నియోజకవర్గం పరిధిలో ఐదుగురు అభ్యర్థులు దరఖాస్తులను సమర్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ డి. అఖిల, తహసీల్దార్ శ్రీరామమూర్తి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వైసీపీ అభ్యర్థి కన్నపురాజు కమ్మిల (కేకే రాజు) తన నామినేషన్ పత్రాలు రెండు సెట్లు సమర్పించారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఐఎన్‌సీ) అభ్యర్థిగా గొంప గోవిందరాజు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా సుమ కమ్మిల, రోణంకి చలపతి రావు, బొర్ర రమేష్ నామినేషన్లు అందజేశారు.

వాలీబాల్ టోర్నీ విజేత ఇంజనీరింగ్ జట్టు



ట్రోఫీతో విజేత జట్టు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 19: తూర్పుకోస్తారైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న వాల్తేరు డివిజన్ స్పోర్ట్సు మేళా అంతర్ డివిజనల్ పురుషుల వాలీబాల్ టోర్నీలో ఇంజనీరింగ్ శాఖ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. రైల్వే ప్రొటక్షన్ ఫోర్సు (ఆర్పీఎఫ్) రన్నరప్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో ఇంజనీరింగ్ 2-0 స్కోరుతో ఆర్పీఎఫ్‌పై విజయం సాధించింది. కాగా, మహిళల కేటగిరిలో ఆర్పీఎఫ్ విన్నర్స్ కాగా, మెకానికల్ సీ అండ్ డబ్ల్యూ రన్నరప్‌గా నిలిచింది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా, సీనియర్ డీఈఎన్ (కో ఆర్డినేషన్) ఏకే మహరాణా ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్సు ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్, వాలీబాల్ కార్యదర్శి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి పుట్టగతులుండవు

▸▸ ఉత్తరం బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు



ప్రచారంలో మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

మాధవధార, ఏప్రిల్ 19 ; విశాఖ ఉత్తర నియోజకవర్గంలో గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి పనుల ద్వారా ప్రజల ఆదరాభిమానం సొంతం చేసుకున్నట్టు జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి పెన్మెత్స విష్ణుకుమార్ రాజు అన్నారు. శుక్రవారం 49వ వార్డు హైవే రోడ్డులోని శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం నుంచి ఆయన ప్రచారం ప్రారంభించారు. శివుని ఆలయంలో పూజలు చేసిన అనంతరం బీజేపీ, జనసేన, టీడీపీ శ్రేణులతో కలసి సత్యానగర్ పరిసర ప్రాంతాల్లో ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికార పార్టీ అభ్యర్థి సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానని, కొన్ని వేల ఓట్ల మెజారిటీతో తనని ఓడిస్తానని వైసీపీ చేస్తున్న చాలెంజ్‌కు జూన్ 4వ తేదీన జవాబు వస్తుందన్నారు. ప్రస్తుత సీఎం జగన్ అమలు కాని హామీలతో విసిగిపోయిన జనం మే 13వ తేదీన జరిగే పోలింగ్‌కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ప్రజలను మోసం చేసిన వైసీపీకి పుట్టగతులు ఉండవు అని పేర్కొన్నారు. ప్రగతి కోసం ప్రజలు కూటమికి విజయాన్ని అందించాలని ఆయన కోరారు. మార్పుతో రా ష్ట్రంలో అభివృద్ధి ఎలా ఉంటుందో తెలుసుకోగలుగుతారన్నారు. ప్రజలకు కూటమి అమలు చేయనున్న మేనిఫెస్టోను వివరించారు. ఈ ప్రచారంలో జనసేన పార్టీ నుంచి సంకు. వెంకటేశ్వరరావు, బి.రఘు, తెలుగు మహిళా నాయకురాలు ఈతలపాక. సుజాత, బీజేపీ నాయకులు వంశీ యాదవ్, 50వ వార్డు నాయకులు సనపల.వరప్రసాద్, 49వ వార్డు టీడీపీ నాయకులు ఆయన వెంట వార్డు నాయకులు, మహిళలు, కార్యకర్తలు ఉన్నారు. ప్రచారంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్టీఆర్ వేషధారణలో బైక్ ర్యాలీ చేశారు.

ట్రాఫిక్ వలంటీర్లను నియమిస్తాం

▸▸ పోలీసు కమిషనర్ రవిశంకర్

మహరాణిపేట, ఏప్రిల్ 19: నగరంలో రోడ్డు ప్రమాదాల నిరోధంలో ట్రాఫిక్ పోలీసులు మరింత సమర్థంగా సేవలందించనున్నట్టు పోలీసు కమిషనర్ ఎ. రవి శంకర్ అయ్యన్నార్ తెలిపారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, మద్యం మత్తుతో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ పెద్దమొత్తంలో ట్రాఫిక్ గాడ్జెట్స్ (పరికరాలు)ను కొనుగోలు చేశారు. శుక్రవారం బీచ్‌రోడ్డులో సీపీ వాటిని ఆవి ష్కరించి పోలీసు సిబ్బందికి అందించారు. వీటిలో 200 బ్రీత్‌ఎనలైజర్సు, 200 వీల్‌లాక్స్, 200 బాడీ వార్న్ కెమెరాలు 400 రేడియమ్ జాకెట్లు, 400 బటన్‌లైట్లు ఉన్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలతో పలువురు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, వాటిని నివారించేందుకు పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసి ట్రాఫిక్ ట్రాఫిక్ ఎక్విప్‌మెంట్స్ కొనుగోలు చేసినట్టుచెప్పారు. మద్యం తాగి వాహనాలు నడపకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాంగ్ పార్కింగ్ చేసి న వారిపై వీల్ లాక్స్ ద్వారా అరికడతామని తెలిపారు. ట్రాఫిక్ సేవలు అం దిం చేందుకు



ట్రాఫిక్ నియంత్రణ సామగ్రి ఆవిష్కరిస్తున్న సీపీ రవిశంకర్ అయ్యన్నార్

స్వచ్ఛందంగా వచ్చిన వారిని వలంటీర్లుగా తీసుకొని వారికి శిక్షణ అందిస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం వారికి ప్రతీ మూడు కిలో మీటర్ల పరిధి లో సేవలందిస్తారన్నారు. వీరికి ఆర్థికంగా, సాంకేతికంగా పూర్తి సహాయం అందించనున్నట్టు వివరించారు.ఈ కార్యక్రమంలో అంధ విద్యార్థులు ఆరోగ్య సందేశాత్మక ప ద్యాలను ఆలపించారు. ఈకార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ ఓటమి ఖాయం

▸▸ టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ

▸▸ టీడీపీలో చేరిన వందలాదిమంది వైసీపీ కార్యకర్తలు



టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులతో శ్రీభరత్, గండిబాబ్జీ

మహరాణిపేట, ఏప్రిల్ 19: ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాష్ట్ర సచివాలయానికి, మాజీగా ముఖ్యమంత్రి జగన్ ఇంటి ముఖంపట్టడం ఖాయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గం నేత సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యంలో వందలాది మం ది వైసీపీ నాయకులు, కార్యాకర్తలు టీడీపీలో చేరారు. వారికి విశాఖ పార్లమెంట్ అభ్యర్థి ఎం. శ్రీ భరత్, గండిబాబ్జీలు కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాబ్జీమాట్లాడుతూ రాష్ట్రమంతటా వైసీపీకి వ్యతిరేక పవనాలు వీసు_న్నాయని, ప్రజలు మార్పును కోరుకుంటున్నారన్నారు. ఈస్థితిలో జగన్ ఓటమి ఖాయమన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబు ముఖ్య మంత్రిని చేయటానికి కృషి చేయాలని కోరారు. నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరువ్యాపారులు నష్టపోయారు

సీతమ్మధార: వైసీపీ ప్రభుత్వంలో చిన్న వ్యాపారులు సైతం నష్టపోవాల్సిన పరిస్థితులు వచ్చాయని కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ విమర్శించారు. స్వయం ఉపాధి పొందుతూ మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించే వైశ్యులపై సైతం వైసీపీ ప్రభుత్వం దాడులకు పాల్పడిందని ఆరోపించారు. స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఉత్తర ఎమ్మెల్యే బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుతో కలిసి పాల్గొన్నారు. వ్యాపారులు పారిశ్రామిక వేత్తలను ప్రభుత్వం వేధింపులకు గురి చేసిందన్నారు. సమావేశంలో కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు గాది రాజు, ప్రతినిధులు కృష్ణారావు, పూడి తిరుపతి రావు, బీజేపీ జిల్లా అధ్య క్షుడు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మార్పు

▸▸ గిడ్డి ఈశ్వరికే చాన్స్?

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

తెలుగుదేశం పార్టీ పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి కిల్లు వెంకట రమేశ్‌నాయుడును మార్చాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. ఈ మేరకు టీడీపీ అరకులోయ పార్లమెంట్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్‌కు పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్య శుక్రవారం ఫోన్ ద్వారా తెలిపారు. అలాగే ప్రస్తుతం అభ్యర్థిగా ప్రకటించిన రమేశ్ నాయుడుకి, టికెట్ పొందబోయే మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి ఈ సమాచారాన్ని చేరవేయాలని ఆయన శ్రావణ్‌కుమార్‌కు సూచించారు.



గిడ్డి ఈశ్వరి

దీంతో శుక్రవారం మధ్యాహ్నం అభ్యర్థి మార్పుపై మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్.. రమేశ్‌నాయుడు, గిడ్డి ఈశ్వరిలతో వేర్వేరుగా మాట్లాడారు. పార్టీ అధిష్ఠానం తీసుకునే ఈ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని ఆయన సూచించారు. పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మార్పుపై మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి సంప్రతించగా... అభ్యర్థిని మార్చుతున్న విషయం నిజమేనని, అధిష్ఠానం సూచనలతో ఈ విషయాన్ని రమేశ్‌నాయుడు, గిడ్డి ఈశ్వరికి తెలిపానన్నారు.

నియోజకవర్గంపై పట్టు సాధించడమే కారణం

అనూహ్య రీతిలో స్థానిక టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రమేశ్‌నాయుడు మార్పు జరగడం ప్రస్తుతం మన్యంలో చర్చనీయాంశమైంది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి నియోజకవర్గంపై సంపూర్ణమైన పట్టు సాధించడమే ఇందుకు కారణమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. వాస్తవానికి నెల క్రితమే మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికే టికెట్ దక్కాల్సి ఉన్నా, నియోజకవర్గంలోని టీడీపీ సీనియర్ నేతలు వర్గాలుగా విడిపోవడం, తదితర కారణాలతో కొత్త వ్యక్తికి టికెట్ ఇస్తే బాగుంటుందని పార్టీ భావించింది. దీంతో ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి ఈ ఏడాది జనవరి 4న టీడీపీలో చేరిన కిల్లు వెంకట రమేశ్‌నాయుడుకి స్థానిక ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. అయితే నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేసి, పట్టు సాధించిన పార్టీ ఇన్‌చార్జికి టికెట్ దక్కకపోవడంపై నియోజకవర్గం ఐదు మండలాలకు చెందిన నేతలు అసంతృప్తి చెందారు. దీంతో రెబల్‌గా నైనా ఎన్నికల బరిలో దిగాలని గిడ్డి ఈశ్వరిని టీడీపీ శ్రేణులు కోరాయి. దీంతో ఆమె రెబల్‌గా బరిలోకి దిగాలని నిర్ణయించారు. ఇదే క్రమంలో టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన రమేశ్‌నాయుడు ఎన్నికల నేపథ్యంలో చేపడుతున్న చర్యలు, నియోజకవర్గంలోని స్థితిగతులపై నిర్వహించిన సర్వేలో ఆయనకు ప్రతికూలమైన ఫలితాలు వచ్చాయని తెలిసింది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గిడ్డి ఈశ్వరి అయితేనే గెలుపు ఖాయమనే ప్రచారం నియోజకవర్గంలో విస్తృతంగా జరగడంతో అభ్యర్థి మార్పుపై టీడీపీ అధిష్ఠానం మొగ్గుచూపింది. దీంతో గిడ్డి ఈశ్వరికే టికెట్ ఇస్తామని టీడీపీ అరకులోయ పార్లమెంట్ స్థానం అధ్యక్షుడు, మాజీ కిడారి శ్రావణ్‌కుమార్ ద్వారా అధిష్ఠానం చెప్పించింది. దీంతో ఆమె శనివారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌లను కలిసేందుకు వెళ్లనున్నారు.

వెలగపూడి ఆస్తులు రూ. 20,20,12,700

▸▸ ఆయన పేరుతో రూ.13.73 కోట్లు

▸▸ భార్య పేరిట రూ.6.47 కోట్లు

▸▸ అప్పులు రూ.2.45 కోట్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ తూర్పు నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే వెల గపూడి రామకృష్ణబాబుశుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. అఫిడవిట్‌లో ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలు పొందుపర్చారు.వెలగపూడి మొత్తం ఆస్తులు రూ. 13,73, 09,440,అతని సతీమణి సుజన పేరిట ఆస్తులు రూ.6,47,0 3,260 వెరసి రూ. 20,2012,700గా చూపించారు. వెలగపూడి వద్ద నగదు రూ. 2,69,200, వివిధ బ్యాంకుల్లోని పొదుపు ఖాతాలలో డిపాజిట్లు, ఇతర రూపేణా, రుణం కలిపి రూ. 2,89,50,151,సతీమణి సుజన వద్ద రూ.6,97,000 న గదు, బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్లు, రుణం అడ్వాన్స్‌లు రూ. 1,07,01,300గా చూపించారు. ఈ దంపతులకు మూడు వా హనాలు, బైక్ ఉంది. ఎంవీపీకాలనీలో ఇల్లు, పలుచోట్ల స్థలాలు కలిసి వెలగపూడి స్థిరాస్తి రూ. 13,70,40,240. భార్య సుజనపేరిట రూ. 6,40,06,260 విలువైన స్థిరాస్తులున్నాయి. వెలగ పూడికి రూ.1,42,80,000, భార్య సుజనకు రూ. 1,02, 87,553 అప్పులున్నాయి. వెలగపూడిపై 2019, 2020, 2022లో ఆరిలోవ, ఎయిర్‌పోర్టు, ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్లలో 4 కేసులునమోదైనట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

కేకే రాజు ఆస్తులు రూ.42,27,75,132

▸▸ భార్య పేరు మీద రూ7.19 కోట్లు

▸▸ అప్పులు రూ.20,36,28,977

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ నార్త్ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా కమ్మిల కన్నపరాజు, ఆయన భార్య కమ్మిల సుభ నామినేషన్ దాఖలు చేశారు. వీరిద్దరూ సమర్పించిన అఫిడవిట్‌లలో తమతోపాటు కుటుంబసభ్యుల పేరు మీద ఉన్న ఆస్తులు, అప్పులు కేసుల వివరాలను పేర్కొన్నారు. కేకే రాజుపై మూడు కేసులున్నాయి. అతనిపేరుపై చరాస్తులు రూ.13,48,50,132, భార్య సుమ పేరుపై రూ.2,02,08,386 ఉన్నాయి. ఇద్దరు పిల్లలుండగా, ఒక్కొక్కరి పేరు మీద రూ.46,573 చొప్పున ఆస్తులు ఉన్నట్టు చూపించారు. కేకే రాజు పేరు మీద రూ.28,79,25,000,భార్య పేరు మీద రూ. 5,17,87,000 స్థిరాస్తులున్నట్టు చూపించారు. కేకే రాజు పేరు మీద రూ.20,36,48,977 కోట్ల రుణాలుండగా, ఆయన భార్య పేరు మీద రూ. 1,51,32,122 రుణాలున్నాయి. కేకే రాజు వద్ద రూ.80,911, భార్య సుమ వద్ద రూ.45,513 నగ దు ఉన్నట్టు చూపించారు. ఇళ్లు, వాహనాలు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

అదీప్‌రాజ్ ఆస్తుల వివరాలు..

పెందుర్తి, ఏప్రిల్ 19: ప్రస్తుత ఎమ్మెల్యే, వైసీపీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శుక్రవారం నామినేషన్ సమర్పించారు. ఈఅఫిడవిట్‌లో ఆస్తులు, అప్పుల వివరాలను అందజేశారు. అదీప్‌రాజ్ పేరు మీదచరాస్తులు రూ. 2,11,22,608, స్థిరాస్తులు 2,01,69,650, ఇంప్రూవబుల్ ప్రాపర్టీ కింద రూ. 1,33,02,500గా చూపారు. ఈ మూడు కలిపి రెండూ కలిపి రూ.5,45,94,758. ఆయన భార్య శిరీష పేరు మీద చ రాస్తులు రూ.80,84,748, 70గ్రాముల బంగారం..దీని విలువ రూ4.90 లక్షలు, స్థిరాస్తులు రూ.40,43,000గా చూపారు. ఈ మొ త్తం కలిపి రూ.12,6,17,748. అదీప్‌రాజ్ అప్పులు కింద రూ.1,52, 47,990 చూపించారు. ప్రస్తుతం ఆయన చేతిలో రూ.94,500, శిరీష వద్ద రూ.54,000 ఉన్నట్టు పొం దు పరిచారు. అలాగే అదీప్‌రాజ్‌కు పినగాడిలో మామ గిఫ్ట్‌గా ఇచ్చి న స్థలం 72,745 చదరపు గజాలు. ప్రస్తుతం దీని విలువ 4,84,86.800. శిరీష పేరిట రాంపురంలో రెండుచోట్ల 8,792 చదరపు గజాల స్థలం, రుషికొండలో అన్‌డివైడడ్ షేర్ ల్యాండ్ 439 చదరపు గజాలు ఉన్నట్టు చూపారు. అదీప్‌రాజ్‌కుపినగాడి, అంతకాపల్లి, గొరపల్లిల్లో ఉన్న సుమారు ఆరెకరాలు రూ.35 ల క్షలుగా పేర్కొన్నారు. శిరీష పేరిట సుమారు 50 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది.

అదీప్‌రాజ్‌పై కేసులు

పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 402-2017, కొత్తవలసలో ఎఫ్ఐఆర్ సీ3సి-1242-2016 కేసులు, సీసీ 179-2018 ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ విశాఖ, సీసీ 293-2022 ఆరోమెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ రైల్వే కోర్టు కేసులు ఉన్నట్టు చూపారు.

అనకాపల్లి జిల్లాలోకి జగన్ బస్సు యాత్ర

... 7వ పేజీ తరువాయి

మండలం గొడిచెర్ల చేరుకున్నారు. ఇక్కడ జాతీయ రహదారి పక్కన ఖాళీ పొలంలో బస చేసేందుకు (బస్సులోనే) ఏర్పాట్లు చేశారు.

నేడు గొబ్బూరులో బహిరంగ

శనివారం ఉదయం తొమ్మిది గంటలకు నక్కపల్లి మండలం గొడిచెర్ల నుంచి బస్సు యాత్రను కొనసాగిస్తారు. ఎలమంచిలి బైపాస్ మీదుగా మధ్యాహ్నం 12.30 గంటలకు అచ్యుతాపురం చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్న భోజనం అనంతరం కశింకోట మండలం తాళ్లపాలెం సమీపంలో గొబ్బూరు చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు అక్కడ ఏర్పాటుచేసే బహిరంగ సభలో పాల్గొంటారు. తరువాత తాళ్లపాలెం జంక్షన్, కశింకోట, కొత్తూరు, అనకాపల్లి, శంకరం, రేబాక మీదుగా అనకాపల్లి మండలం చిన్నయ్యపాలెం వద్ద రాత్రి బసకు చేరుకుంటారు.

సింహాచలం దేవస్థానాన్ని కలెక్టర్ చేతిలో పెడితే ఎలా!?

... 7వ పేజీ తరువాయి

చేసినా ధర్మకర్తకు కనీసం సమాచారం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం గురించి చెప్పలేదని, అందులో తీసుకున్న నిర్ణయాలు కూడా తనకు తెలియజేయలేదన్నారు. ఇవన్నీ చూస్తుంటే..శ్రీవరహా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం స్వయం ప్రతిపత్తిని, కీర్తిని కావాలనే దెబ్బతీస్తున్నట్టుగా ఉందని, అలాంటి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

రెండో రోజు 28 నామినేషన్లు

... 7వ పేజీ తరువాయి

నామినేషన్లు దాఖలు చేశారు. సెగ్మెంట్‌ల వారీగా పరిశీలిస్తే..భీమిలికి స్వతంత్ర అభ్యర్థులుగా బుగత రాము, నాగామమి నాగోతు ఒక్కొక్క సెట్, విశాఖ తూర్పు నియోజకవర్గానికి టీడీపీ తరపున వెలగపూడి రామకృష్ణబాబు, ఆయన సతీమణి సుజన రెండేసి సెట్లు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఇ.హైమావతి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. విశాఖ ఉత్తరం నియోజకవర్గానికి వైసీపీ నుంచి కేకే రాజు రెండు సెట్లు, కాంగ్రెస్ నుంచి జి.గోవిందరాజు, స్వతంత్రులుగా బొర్రా రమేష్‌సుమ, రోణంకి చలపతిరావు ఒక్కొక్క సెట్, విశాఖ పశ్చిమకు వైసీపీ తరపున ఆడారి ఆనంద్‌కుమార్ రెండు సెట్లు, జైభారత్ నేషనల్ పార్టీ నుంచి జె.వెంకటగణేష్ ఒక సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. పెందుర్తి అసెంబ్లీ స్థానానికి వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, జనసేన నుంచి పంచకర్ల రమేష్‌బాబు, పంచకర్ల మహాలక్ష్మి, జైభారత్ నేషనల్ పార్టీ తరపున కె.మహదేవ్ కల్యాణ్‌శ్రీకాంత్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఈత రోజా, సమాజ్‌వాదీ పార్టీ నుంచి బోళం వెంకట మురళీమోహన్, ఇండిపెండెంట్లుగా ఆడారి నాగరాజు, గుంటూరు వెంకటనరసింహామూర్తి, గుంటూరు సాయిప్రియ, కూండ్రపు సన్యాసిరావు ఒక్కొక్క సెట్ నామినేషన్ దాఖలు చేశారు. గాజువాక, విశాఖ దక్షిణ నియోజకవర్గాలకు రెండో రోజు కూడా ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు.

సమస్యలు ఇవీ.. పరిష్కారం చూపరూ..!

మ్యాన్‌హోల్ నుంచి మురుగు

అక్కయ్యపాలెం: గ్రేటర్ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో మ్యాన్‌హోల్ నిండి ము రుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో దు ర్వాసనకుముక్కు మూసుకు రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. చాలా రోజులుగా మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా, జీవీఎంసీ సిబ్బంది సరైన చర్యలు చేపట్టడంలేదని ఆరోపిస్తున్నారు.



43వ వార్డులో శ్రీనివాసనగర్‌లో రోడ్డుపై మురుగు

ప్రయాణం... ప్రమాదకరం

జగదాంబ కూడలి, ఏప్రి ల్ 19: రద్దీగా ఉండే కేజీహెచ్ పోలీస్ క్వార్టర్స్ నుంచి లేపాక్షి మెయిన్ రోడ్డుకు కలిపే కుమ్మరవీధి రహదారి శిథిలావస్థకు చేరింది. ఈమార్గంలో నిత్యం సాలిపేట, జెండా జెట్టు , పోలీస్ క్వార్టర్స్, కేజీహెచ్‌కు వెళ్లేందుకు వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. గత పదేళ్లుగా ఈ రహదారిపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్, కార్పొరేటర్ కోడూరి అప్పలరత్నం శ్రద్ధ తీసుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం జీవీఎంసీ వాహనాల రాకపోకలు సాగిస్తున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోలేదంటున్నారు.



కేజీహెచ్ డౌన్ పోలీస్ క్వార్టర్స్ నుంచి లేపాక్షికి వెళ్లే రహదారి దుస్థితి..



5వ వార్డులో గంటా శ్రీనివాసరావుకు హారతి పడుతున్న మహిళలు



పరదేశిపాలెంలో జరిగిన ప్రచారంలో మాట్లాడుతున్న గంటా, పక్కన కోరాడ రాజబాబు

పేదల ఇళ్ల పట్టాలకు శాశ్వత రిజిస్ట్రేషన్

భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు

కొమ్మాది, ఏప్రిల్ 19 : కూటమి అధికారంలోకి రాగానే అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల పట్టాలకు శాశ్వత రిజిస్ట్రేషన్ చేసి అందజేస్తామని ఆ పార్టీ భీమిలి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన 5వ వార్డులోని సాయిరాం కాలనీ, మారికవలస, బోరవానిపాలెం, పరదేశిపాలెంలో కార్పొరేటర్ మొల్లి హేమలత ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో రోడ్లు, కాలువలు, మరెన్నో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. ఈసందర్భంగా కాలనీవాసులు కొండవాలు ప్రాంతానికి మెట్ల మార్గం లేక ఇబ్బంది పడుతున్నామని, నీటి సమస్య ఉందని తెలపడంతో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని గంటా హామీ ఇచ్చారు. గత ఐదేళ్లలో అభివృద్ధి పూర్తిగా పడకేసిందని,నిర్మాణ రంగం దారుణంగా దెబ్బతిందని భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారని చెప్పారు. మధురవాడలో అధికంగా ఉన్నారని భవన నిర్మాణ కార్మికులకు తాము అధికారంలోకి రాగానే వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకునే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. టీడీపీకి మేనిఫెస్టో అంటే భగవద్గీత వంటిదని అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తీరుతామన్నారు.

అడుగడుగునా బ్రహ్మారథం

గంటాకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మారథం పట్టారు. మారికవలసలో మన్యాల సోంబాబు గజమాలతో సత్కరించి ఆహ్వానం పలికారు. వీధుల్లో మహిళలు తిలకం దిద్ది హారతులు పట్టారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా గంటా రాక కోసం ప్రజలు ఎదురుచూశారు. ఆయన ప్రతిఒక్కరిని ఆత్మీయంగా పలకరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మొల్లి లక్ష్మణరావు, విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు వాండ్రాసి అప్పలరాజు, వార్డు అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ, బోయి వెంకటరమణ, నమ్మి శ్రీను, కురుమోజు గోవిందరావు, జి. యోగేశ్వరావు, వైకుంఠరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా 5వ వార్డు నగరంపాలెం, స్వతంత్రనగర్, వైఎస్ఆర్ కాలనీల్లో కూడా గంటా ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా మహిళలు హారతులతో స్వాగతం పలికారు. వైఎస్ఆర్ కాలనీలో ఓలేటి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ గజమాల ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో పార్టీ ఎన్నికల కార్యాలయం

మధురవాడ : కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి దేశంలోనే అగ్రగామిగా నిలుపుతామని భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన పీఎం పాలెం క్రికెట్ స్టేడియం ఎదురుగా ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల తరువాత రాష్ట్రంలో వైసీపీ కనుమరుగవుతుందన్నారు. 2014-2019 వరకు జరిగిన అభివృద్ధే రాష్ట్రంలో ఇప్పటికీ కనిపిస్తుందన్నారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో మంత్రిగా తాను భీమిలి నియోజకవర్గంలో రూ.3,800 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టానని, ఆ అభిమానంతోనే ప్రజలు మళ్లీ తనను ఆదరిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, మొల్లి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



పీఎం పాలెంలో ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న గంటా

ప్రమాదాలకు 'డైవర్షన్'

- అత్యంత దారుణంగా చింతల గెడ్డపై వంతెన
- కానరాని వన్ వే హెచ్చరిక బోర్డు
- తరచూ ప్రమాదాల బారిన వాహనదారులు

భీమునిపట్నం, ఏప్రిల్ 19 : బీచ్ రోడ్డులో చేపల తిమ్మాపురం, తొట్లకొండ మధ్య తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. కొందరు గాయాలతో బయట పడుతుండగా, మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. సుమారు ఆరేళ్ల క్రితం చేపల తిమ్మాపురం అమ్మవారి ఆలయం సమీపంలో చింతలగెడ్డపై వున్న వంతెన ఒకవైపునకు ఒరిగిపోవడంతో నగరం నుంచి భీమిలి వెళుతున్న మార్గాన్ని అధికారులు మూసి వేసి డైవర్షన్ ఇచ్చారు. దీంతో నాలుగు లేన్ల రహదారిగా వున్న బీచ్ రోడ్‌లో తిమ్మాపురం నుంచి తొట్లకొండ వరకూ వన్ వే ఏర్పాటు చేశారు. ఈ రహదారి వన్‌వేగా ఉందన్న విషయాన్ని తెలియజేసే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. పది రోజుల క్రితం చిప్పాడలోని దివీస్ కంపెనీలో పని చేస్తున్న పార్వతీపురం జిల్లాకు చెందిన యువకుడు బైక్‌పై వస్తుండగా తొట్లకొండ మలుపులో అదుపు తప్పి ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. అలాగే నెల రోజుల క్రితం ఇక్కడి ఎగువపేటలో శుభ కార్యానికి వచ్చి నగరంలోని పెదజాలారిపేటకు ఆటోలో తిరుగు ప్రయాణమవుతున్న ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యారు. నగరం నుంచి ఈ రోడ్‌లో వన్‌వేలో వస్తున్న సిటీ బస్సు నిలిపివేసినా కనీసం గుర్తించకుండా ఎదురుగా వెళుతున్న ఆటో బలంగా ఢీకొనడంతో ఆటో డ్రైవర్ తీవ్ర గాయాలయ్యాయి. గత మంగళవారం అర్ధరాత్రి రెండు బైక్‌లు ఢీకొనడంతో రుషికొండకు చెందిన దౌలపల్లి చిన అప్పలరాజు, పెదజాలారిపేటకు చెందిన చింతపల్లి వీరభద్ర మృత్యువాత పడ్డారు. మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇలా పలు ప్రమాదాలు జరుగుతున్నా, అధికారులు ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవడం లేదు. కనీసం వంతెన నిర్మాణంలో వుందని, రేడియం బోర్డులు అయిదారు ఏర్పాటు చేసినా వాహనచోదకులు అప్రమత్తం అవుతారు. అలాగే ట్రాఫిక్ పోలీసులు రోడ్ డైవర్షన్ వద్ద ఒక కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసినా ఫలితం ఉండడం లేదు. మరో వైపు శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో వన్‌వేగా మార్పు చేసిన రోడ్‌లో ఎడమ చేతి వైపు ముళ్ల పొదలు రహదారి మధ్య వరకూ అల్లుకుని ఉండడంతో అటు వైపు వచ్చే వాహనదారులు ఆకస్మాత్తుగా కుడి వైపు తిప్పుతుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. సరిగ్గా ఇదే రహదారిలో రాత్రి వేళ సెంట్రల్ లైటింగ్ వెలగదు. దీంతో రహదారి అంధకారంగా ఉండడం కూడా ప్రమాదాలకు మరో కారణం. కాగా వంతెన నిర్మాణానికి నాలుగు నెలలుగా టెండర్లు పిలుస్తున్నా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం, అవసరమైన నిధులు ఆర్అండ్‌బీ వద్ద లేకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. దీంతో జీవీఎంసీ ఇంజనీరింగ్ ప్రాజెక్టు విభాగం వారం రోజుల క్రితం వంతెన నిర్మాణం చేపట్టింది. పనుల పూర్తికి ఐదు నెలలు పట్టే పరిస్థితి ఉంది. అప్పటివరకు ప్రమాదాలు జరగకుండా పలు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వంతెన నిర్మాణం వల్ల ఒకవైపు మూసివేసిన రహదారి



ప్రాథమిక దశలోనే ఉన్న వంతెన నిర్మాణం

ప్రతిపక్షాలకు రాజకీయం వ్యాపారం

- వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- భీమిలి, ఆనందపురం మండలాల్లో ప్రచారం

ఆనందపురం, ఏప్రిల్ 19 : గంటా శ్రీనివాసరావుకు రాజకీయం ఒక వ్యాపారం మాత్రమేనని, ఆయనకు ప్రజా సంక్షేమం పట్టదని వైసీపీ భీమిలి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం ఆయన వేములవలస గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గంటా ఎన్నికల సమయంలో తెరపైకి వచ్చి డబ్బు, బలంతో ప్రజలను మభ్యపెట్టి గెలిచాక ఐదేళ్లు కనిపించరని చెప్పారు. గంటా, అతని అనుచరులు తాను అనకాపల్లి ఎంపీగా వెళ్లిపోతున్నట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది సరికాదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో తాము ఐదేళ్లలో రూ. 2500 కోట్ల ప్రజా సంక్షేమానికి, అభివృద్ధి పనులకు ఖర్చు చేశామని వివరించారు. ఇద్దరు, ముగ్గురు సర్పంచులు టీడీపీలో చేరి నంత మాత్రాన వైసీపీ ఖాళీ అన్నట్టు కాదని చెప్పారు.నియోజకవర్గంలో సుమారు 68 మంది సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మిగిలిన నాయ కులు తమ వెంటే ఉన్నారని, మే 13 తర్వాత గంటా ఓటమి ఖాయమని జోష్యం చెప్పారు. గంటాకు ఓటు వేసేకంటే నోటాకు వేయడం ఉత్తమం అన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు ఎలా ఉన్నా, అవంతి స్థానికంగానే ఉంటాడని, ప్రజా క్షేత్రంలో తిరుగుతానని, మరి గంటా ఎక్కడ ఉంటారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. గంటా అనుచరులు తమ సర్పం చులు, నాయకులకు ఫోన్లు చేసి పార్టీ మారాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని,ఇలాంటి పనులు ఆపకపోతే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.ప్రజలను ఓటు అడిగే హక్కు కేవలం వైసీపీకి మాత్రమే ఉందన్నారు. తనపై వ్యక్తిగత దూషణలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. భీమిలిలో వైసీపీ గెలుపు ఖాయమని, ఈనెల 24న జరగనున్న నామినేషన్ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బంక సత్యనారాయణ, కోరాడ వెంకటరావు, మజ్జి వెంకటరావు, మణి శంకరనాయుడు, పాంట్రంకి శ్రీను, తదితరులు పాల్గొన్నారు. కాగా అనంతరం ఆయన ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీతో కలిసి చందక, గొట్టిపల్లి, కుసులువాడ పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బంక శ్రీను, మహంతి వెంకటలక్ష్మి, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.



ఆనందపురంలో ప్రచారం నిర్వహిస్తున్న అవంతి, బొత్స ఝాన్సీ



భీమిలిలో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

భీమునిపట్నం : పట్టణంలోని పండావీధి, లంకాడవారి వీధి, గౌడవీధి, సుభాష్ రోడ్డు ప్రాంతాల్లో ముత్తంశెట్టి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను, భీమిలిలో తాను చేసిన అభివృద్ధిని పరిశీలించి ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈమేరకు ఆయన ఇంటింటికి వెళ్లి ప్రచార కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మైలపల్లి భారతి, మైలపల్లి షణ్ముఖరావు, మైలపల్లి లక్ష్మణరావు, అల్లిపిల్లి నర్సింగరావు, పాసి స్వర్ణలత, శిరుగుడి సూర్యనారాయణ, ప్రగడ చంటి, రాంభుక్త ప్రభాకరనాయుడు, గుండాసు మధునాయుడు, డింగి దుర్గారెడ్డి, కర్రోతు నాగేంద్ర పాల్గొన్నారు.

24న ముత్తంశెట్టి నామినేషన్

భీమిలి వైసీపీ అభ్యర్థిగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈనెల 24న నామినేషన్ వేయనున్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. నామినేషన్ కార్యక్రమం టీడీపీ కంటే ఘనంగా నిర్వహించాలని,జన సమీకరణ భారీ ఎత్తున చేపట్టాలని నాయకులకు సూచించినట్టు తెలిసింది. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలన్నారు. 2009 ఎన్నికల్లో ముత్తంశెట్టి బీచ్‌రోడ్‌లో సాగర సంగమం వద్ద స్నానాలు ఆచరించే స్థలంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. 2019 ఎన్నికల్లోనూ అదే చోట సభ ఏర్పాటు చేశారు. ఇపుడు కూడా సెంట్‌మెంట్‌గా భావించి అదే స్థలంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి, ఊరేగింపుగా నామినేషన్ వేయడానికి వెళ్లాలని నిర్ణయించినట్టు సమాచారం.



ర్యాలీలో పాల్గొన్న కూటమి శ్రేణులు

అట్టహాసంగా వెలగపూడి నామినేషన్

- భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- పసుపుమయమైన రహదారులు



ప్రజలకు అభివాదం చేస్తున్న శ్రీభరత్, వెలగపూడి, గండి బాబ్జీ

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా వెలగపూడి రామకృష్ణబాబు, అతని సతీమణి సుజన శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఎంవీపీ కాలనీలోని తన కార్యాలయం నుంచి భారీ ఊరేగింపుతో కలెక్టరేట్‌కు వచ్చారు. కలెక్టరేట్ ప్రధాన గేటు వరకు ఓపెన్ టాప్ వాహనంపై వచ్చిన ఆయన అక్కడ నుంచి మధ్య గేటు మీదుగా లోపలకు చేరారు. అక్కడి నుంచి టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, పార్టీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ, సీనియర్ నేత చోడే వెంకట పట్టాభితో కలిసి వెళ్లి తూర్పు రిటర్నింగ్ అధికారి, జేసీ మయూర్ అశోక్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు.అంతకముందు వెలగపూడి సతీమణి సుజన పట్టాభితో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. కాగా ఎంవీపీ కాలనీ నుంచి అప్పుఘర్, బీచ్‌రోడ్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. ఓపెన్ టాప్ వాహనంపై వెలగపూడితో పాటు లోక్‌సభ అభ్యర్థి శ్రీభరత్, గండి బాబ్జీ, వెలగపూడి కుమారుడు ప్రతాపరుద్ర, పట్టాభి ఉన్నారు. ప్రతిసారి నామినేషన్ల సందర్భంగా తల్లిదండ్రులు వచ్చేవారు. ఈసారి కుమారులు ఫణిభూషణ్, ప్రతాప రుద్ర, మనవడు వచ్చారు.

భారీగా తరలివచ్చిన అభిమానులు

ఎంవీపీ కాలనీ : వెలగపూడి నామినేషన్‌కు ఊహించిన దానికంటే భారీగా జనం రావడంతో తెలుగుదేశం శ్రేణులు సంతోషం వ్యక్తం చేశాయి. కనీసం 15 వేల మంది ర్యాలీలో పాల్గొంటారని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు. అయితే ఒక్క 12వ వార్డు నుంచే సుమారు మూడు వేల మంది వచ్చారు. 300 ఆటోలు, 250 బైకులతో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు కూడా రావడంతో ర్యాలీ భారీగా జరిగింది. ర్యాలీ ఉషోదయ కూడలి వద్దకు చేరేసరికి దక్షిణ నియోజకవర్గం జన సేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే బీచ్ రోడ్డులో ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ చేరారు. జనసేన కార్పొరేటరు పీతల మూర్తి యాదవ్ భారీగా కార్యకర్తలతో ర్యాలీలో పాల్గొన్నారు. కాగా సెంటిమెంట్ ప్రకారం వెలగపూడి హనుమంతువాక విజయదుర్గా కాలనీ దుర్గాదేవి ఆలయం వద్దకు వచ్చి, నామినేషన్ పత్రాలను అమ్మవారి పాదాల వద్ద ఉంచి పూజ చేశారు.

కొందరు అధికారులు వైసీపీ కోసం పని చేస్తున్నారు : వెలగపూడి

విశాఖపట్నం : నగరంలో కొందరు ప్రభుత్వ అధికారులు వైసీపీ కోసం పని చేస్తున్నారని వెలగపూడి ఆరోపించారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవీఎంసీలో యూసీడీ, ఎక్సైజ్‌తో పాటు మరికొన్ని శాఖల అధికారుల తీరు ఆక్షేపణీయంగా ఉందన్నారు. నామినేషన్ దాఖలులో పాల్గొనేందుకు వచ్చిన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలకు ఆటోలు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అధికారులు విధులు నిర్వహించాలి తప్ప ఒక పార్టీకి అనుకూలంగా పనిచేయకూడదన్నారు.

జగన్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యం : ఎంవీవీ

మద్దిలపాలెం, ఏప్రిల్ 19 : రాష్ట్రంలో జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే ప్రజా సంక్షేమం సాధ్యమని వైసీపీ తూర్పు అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సాయంత్రం 22వ వార్డు న్యూరేసపువానిపాలెంలో జరిగిన సిద్ధం సభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ అనేక సంక్షేమ పథకాల ద్వారా పేదలను ఆదుకున్నారని గుర్తుచేశారు.రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ఓర్వలేక కూటమి పార్టీలు వైసీపీ పాలనపై దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. మూడు దఫాలు తూర్పులో ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. తనకు ఒక అవకాశం కల్పిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో తూర్పు ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, నాయకులు పాల్గొన్నారు. కాగా అంతకముందు ఎంవీవీ సత్యనారాయణ 23వ వార్డు మద్దిలపాలెంలో పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనను గెలిపించాలని కోరారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రతి ఒక్క అర్హునికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. పాదయాత్రలో వార్డు కార్పొరేటర్ విజయసాయి, గుడ్ల సత్యరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పెదవాల్తేరు : వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్య, వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని ఆ పార్టీ తూర్పు అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన పెదజాలారిపేటలో పార్టీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకట లక్ష్మీ దాస్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వర్గాల వారికి లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాడమొదుల గణేష్, తదితరులు పాల్గొన్నారు.




న్యూరేసపువానిపాలెంలో జరిగిన సిద్ధం సభలో మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ

అప్పన్న వార్షిక కల్యాణోత్సవంలో వాహన సేవలు

సింహాచలం, ఏప్రిల్ 19 : వరాహలక్ష్మీనృసింహుని వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రతిరోజూ ఒక వాహనంపై బేడా మండపంలో లేదా మాడవీధుల్లో తిరువీధి నిర్వహిస్తారు.ఈమేరకు ఈనెల 20న సాయంత్రం 5 గంటలకు శేష వాహనంపై మాడవీధుల్లో తిరువీధి, 21న సాయంత్రం 6 గంటలకు సర్వజన మనోరంజని వాహనంపై మాడవీధుల్లో తిరువీధి, 22న సాయంత్రం 5 గంటలకు సూర్యప్రభ వాహనంపై, 23న ఉదయం 6.30 నుంచి 8 వరకు పల్లకిలో తిరువీధి, రాత్రి 9 గంటలకు మృగయోత్సవం (దొంగల దోపు) సందర్భంగా అశ్వ వాహనంపై తిరువీధి, 24న ఉదయం 8 గంటలకు వినోదోత్సవం జరగనున్నాయి.



సూర్యప్రభ వాహనం



శేష వాహనం

నేడు కార్యక్రమాలు

వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాల్లో ఆదివారం వేకువజామున నాలుగు గంటలకు సుప్రభాత సేవ, ప్రభాతారాధన, విశేష హోమాలు, బాలభోగం నివేదన, గ్రామ బలిహరణం, ఉదయం 7.30 గంటలకు మంగళ శాసనం ఉంటుంది. మధ్యాహ్నం 11.30 గంటల వరకు భక్తులకు సర్వదర్శనాలు, 11.30 నుంచి 12.30 వరకు మహానివేదన, 12.30 నుంచి 2.30 వరకు దర్శనాలు, 2.30 నుంచి 3 వరకు పవళింపు సేవ, దర్శనల నిలుపుదల, సాయంత్రం 5 గంటలకు శేష వాహనంపై మాడవీధుల్లో స్వామివారి తిరువీధి జరగనుంది. రాత్రి 7 గంటలకు రాత్రి ఆరాధన, విశేష హోమాలు, దర్శనాల నిలుపుదల, రాత్రి 10 గంటలకు ప్రత్యేక నివేదన, గ్రామ బలిహరణం, మంగళా శాసనం, పవలింపు సేవ, కవాట బంధనం చేయనున్నారు.





వరాహలక్ష్మీనృసింహుని వార్షిక తిరు కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తుల హరి నామ స్మరణల నడుమ శుక్రవారం రాత్రి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శనలు - సింహాచలం

రెండో రోజు రెండు నామినేషన్లు

భీమునిపట్నం, ఏప్రిల్ 19 : భీమిలి నియోజకవర్గానికి సంబంధించి శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్. భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం..పద్మనాభం మండలం పద్మనాభం గ్రామానికి చెందిన బుగత రాము స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అలాగే మధురవాడ దుర్గానగర్‌కు చెందిన నాగోతు నాగమణి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులు కావడంతో ఒక్కో అభ్యర్థికి పది మంది ఓటర్లు ప్రతిపాదించారు. బుగత రాము (29) ఎంఏ పొలిటికల్ సైన్స్ చదివారు. మరో ఇండిపెండెంట్ అభ్యర్థిని నాగమణి (42) ఎంబీఏ చదివారు.

స్మార్ట్ కంప్యూటరింగ్‌పై సదస్సు

తగరపువలస, ఏప్రిల్ 19 : సంగివలసలోని అనిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో స్మార్ట్ కంప్యూటరింగ్‌పై శుక్రవారం నుంచి అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పిబకుమార్ ఉద్ఘట ప్రారంభించారు. సీఎస్‌సీ, ఐటీ, సీఎస్ఎం వంటి ఐదు విభాగాలు సంయుక్తంగా ఈ సదస్సును ఏర్పాటు చేయగా ప్రపంచంలో వివిధ యూనివర్సిటీల నుంచి 90 పరిశోధనా వ్యాసాలను ఎంపిక చేసి వాటిపై చర్చ జరిపారు.

వైసీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

పద్మనాభం, ఏప్రిల్ 19 : మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ భద్రయ్యపేట గ్రామంలో వైసీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు మద్దతుగా పార్టీ నాయకులు శుక్రవారం రాత్రి ఇంటింట ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈర్లె రాజేశ్వరి, ఉప సర్పంచ్ ఎస్. ఆదిబాబు, లీగల్ సెల్ అధ్యక్షుడు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..